ఆవిష్కరణల కార్ఖానా..!

- జేఎన్‌టీయూలో రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్
- స్టార్టప్‌లకు ప్రోత్సాహం..
- యువతకు మెరుగైన శిక్షణ
- నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబునాయుడు



రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం రూరల్/వైద్యం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'ఆవిష్కరణల ఆలోచన మీదైతే పెట్టుబడి మాది. మిమ్మల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం. స్వర్ణాంధ్ర-2047 కలను సాకారం చేసుకుందాం' అని యువతకు రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిస్తోంది. ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేసే దిశగా 'రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్'ను నగరంలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసింది. సీఎం చంద్రబాబు వర్చువల్‌గా బుధవారం ఈ సెంటర్‌ను

(మిగతా 6వ పేజీలో...)

రోగాల ముసురు

- వైరల్ ఫీవర్‌తో వణుకుతున్న ప్రజలు
- ఆస్పత్రుల వద్ద బారులుతీరిన బాధితులు

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఏర్పడిన తడి వాతావరణంతో రోగాలు ముసురుకుంటున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలను జనాలను పట్టి పీడిస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి రోజు 600 నుంచి 800 వరకు ఓపీ ఉంటున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. వీరిలో ఎక్కువగా విష జ్వరాలు, ఆస్తమా, దగ్గు, జలుబు సమస్యలతోనే వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వానతో పాటు ఈదురు గాలుల దెబ్బకు చిన్నారులు, వృద్ధులు దగ్గు, జలుబుతో అల్లాడిపోతున్నారు. ఒకసారి జ్వరం రావడం, తగ్గడం, మళ్లీ రావడం, తగ్గడం జరుగుతోంది. వీటిని పట్టు విడుపు జ్వరాలు అంటారని వైద్యులు చెబుతున్నారు. సరైన చికిత్స తీసుకుంటే ఏమి ఇబ్బంది ఉండదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి రోగాలకు కారణమవుతున్నాయని వారు చెబుతున్నారు.



ప్రభుత్వాస్పత్రి ఓపీలో రోగులు.. డాక్టర్ వద్దకు క్యూ కట్టిన దృశ్యం

మట్టి దోపిడీ..!

- జిల్లాలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- ప్రతి మండలంలోనూ సాగుతున్న తంతు
- కొండలు, గుట్టలను మాయం చేస్తున్న వైనం
- చోద్యంచూస్తున్న గనుల శాఖ అధికారులు



గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలో తవ్వేసిన కొండ ప్రాంతం

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. మట్టి మాఫియా.. కొండలు, గుట్టలను సైతం తవ్వేసి, మైదానాలుగా మార్చేస్తోంది. గత రెండు, మూడు దశాబ్దాల కాలంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. మట్టి దందా మాత్రం ఆగలేదు. ప్రభుత్వానికి చెల్లించేది గోరంతైతే... తవ్వేది మాత్రం కొండలనే. గనుల శాఖ పరిధిలో ఉన్న తవ్వకాల అనుమతులను వైసీపీ హయాంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో మట్టి దోపిడీ మరింత అధికమైంది. జిల్లాలో తక్కువ ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు అనుమతులిచ్చారు. అనధికారికంగా చాలా ప్రాంతాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా గనుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

జిల్లాలో అనుమతుల్లేకపోయినా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వేస్తున్నారు. గుట్టలు, కొండలను సైతం కరిగించేస్తున్నారు. పెద్దపెద్ద కొండలైతే ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి తొలగిస్తున్నారు. మట్టిని వెంచర్లు, భూములు, ఇళ్లు, రోడ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ.8వేల నుంచి రూ.10వేలు సొమ్ము చేసుకుంటున్నారు.

32.55 హెక్టార్లకే అనుమతులు...

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతులున్నాయి. బుక్కరాయసముద్రం పరిధిలో 3, రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి వద్ద 2, తాటిచర్ల వద్ద 3, చియ్యేడు వద్ద రెండు వేర్వేరు ప్రాంతాల్లో 5.66, డీ.హీరేహాళ్ మండలం పులకుర్తి వద్ద 5.65, గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి వద్ద 1.8, కూడేరు మండలం కమ్మూరు వద్ద 3.24, పామిడి సమీపాన 3.3 హెక్టార్లలో, అనంతపురం రూరల్ మండలం కొడిమి వద్ద 4.9 ఎకరాల్లో మట్టి తవ్వకాలకు గనుల శాఖ

(మిగతా 6వ పేజీలో...)

- జిల్లాలో 5.72లక్షల స్మార్ట్‌కార్డులు
- నెలాఖరులోగా పంపిణీకి కసరత్తు



స్మార్ట్‌కార్డు

స్మార్ట్‌గా మార్పు

పాత రేషన్‌కార్డులకు స్వస్తి

పౌరసరఫరాల శాఖలో సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలోనే పాత రేషన్ కార్డులకు స్వస్తి పలికి, కొత్త(స్మార్ట్ కార్డులు) కార్డులు ఇవ్వడానికి పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లాలో 5.72లక్షల రేషన్‌కార్డులను ఏటీఎం కార్డుల తరహాలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 25 నుంచి 31లోగా జిల్లాలో పాత కార్డుదారులతో పాటు కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డులకు వేలాదిగా దరఖాస్తులు వచ్చినా దాదాపు రెండేళ్ల పాటు నానబెట్టి పేదలకు ప్రభుత్వ పథకాలు అందకుండా చేసింది.

-ఆంధ్రజ్యోతి, ధర్మవరం

బొమ్మలకు చెక్

గతంలో జారీ చేసిన రేషన్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మలతో రేషన్ కార్డులుండేవి. ఇప్పుడు ఆ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. స్మార్ట్‌కార్డులపై రాజకీయనేతల బొమ్మల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో పాటు లబ్ధిదారుల ఫొటో, కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా కనిపించేలా రేషన్‌కార్డులు రూపొందిస్తున్నారు. ఇప్పటికే చెన్నై కేంద్రంగా ముద్రణ ప్రక్రియ పూర్తి అయినట్లు సివిల్ సప్లయ్ అధికారు లు చెబుతున్నారు. ఈనెల 25 నుంచి 31లోగా జిల్లా, మండలాల వారీగా నేరుగా స్మార్ట్‌కార్డులను ప్రభుత్వం చేర వేయనున్నట్లు సమాచారం. ఈ కార్డులన్నింటినీ సచివాలయ సిబ్బంది, అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేర వేయనున్నట్లు సమాచారం.


సెప్టెంబరు 1 నుంచి సరుకుల పంపిణీ



ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో 8,332మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో 5,589 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తించారు. వీరికి కొత్త స్మార్ట్‌కార్డులు ఇవ్వనున్నారు. అలాగే రేషన్ కార్డులో మా ర్పుల కోసం 2809, సభ్యుల చేర్పు కోసం 56,419, తొలగింపు కోసం 1289 దరఖాస్తులు వచ్చాయి. వీరందరికీ డిజిటల్ స్మార్ట్‌రేషన్ కార్డులు అందించనున్నారు. ఈనెలాఖరుకు పంపిణీ పూర్తయితే సెప్టెంబరు 1 నుంచి లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డుల ద్వారా బియ్యం సరుకులు పంపిణీ చేయనున్నారు.

క్యూఆర్ కోడ్‌తో కార్డు

డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డును ఏటీఎం, క్రెడిట్ కార్డుల సైజులో క్యూ ఆర్‌కోడ్‌తో ముద్రించారు. లబ్ధిదారులు బియ్యం, సబ్సిడీ సరుకులు తీసుకునే సమయంలో గతంలో సర్వర్ రాక ఈ పోస్ యంత్రాలతో ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు బయోమెట్రిక్ లేకుండా నేరుగా స్మార్ట్ కార్డులోని నెంబరు నమోదు చేస్తే లబ్ధిదారుల పూర్తి వివరాలు రానున్నాయి. ఈ విధానంలో కార్డు దారులు వెంటనే సరుకులు పొందే వీలుంటుంది.



వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఫొటోతో ఇచ్చిన రేషన్‌కార్డు

నెలాఖరులోగా అందజేస్తాం -వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ



రాష్ట్ర ప్రభుత్వం అందించే డిజిటల్ స్మార్ట్‌కార్డులు ఈనెల 25 నుంచి 31వతేదీలోగా అందజేస్తాం. పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాం. కార్డులు పంపిణీ తరువాత సెప్టెంబరు 1 నుంచి బియ్యం, సరుకులు అందిస్తాం.

మహిళా భద్రత కోసం

పటిష్ట చర్యలు

- ఎస్పీ రత్న



విద్యార్థినులతో ఎస్పీ, డీఎస్పీలు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రత్న తెలిపారు. బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్, ర్యాగింగ్, శక్తి యాప్, సైబర్‌నేరాలు, లైంగిక వేధింపుల నుంచి రక్షించుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కళాశాల జీవితంలో ఎన్నో విషయాలు నేర్చుకోగలుగుతామన్నారు. ర్యాగింగ్ వలన కలిగే నష్టాలను తెలియజేశారు. మాదకద్రవ్యాలను తీసుకోవడం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. శక్తి యాప్ మహిళలు, బాలికల భద్రత, రక్షణకు బ్రహ్మాస్త్రమని, ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. శక్తియాప్ వాట్సాప్ నెంబర్ 79934 85111, డయల్ 100, డయల్ 112, చైల్డ్‌మ్యారేజ్ 1098, సైబర్‌క్రైం 1930 నెంబర్లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కాలేజీలో ప్రతిచోట సీసీ కెమెరాలు వినియోగించాలని యాజమాన్యానికి సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమపౌరులుగా దేశానికి సేవలందించాలని ఎస్పీ సూచించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మహిళా డీఎస్పీ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ హేమచంద్రారెడ్డి, సీఐ నోడల్ అధికారి గోపీనాథరెడ్డి, సైబర్‌క్రైం సీఐ మోహన్, ఆర్ఎస్సై వెంకటేశ్వర్లు, ఈగల్ టీం ఇన్‌చార్జ్ శ్రీధర్, శక్తిటీం సభ్యులు పాల్గొన్నారు.

6 కోర్టు ఉద్యోగాలకు నేటి నుంచి పరీక్షలు

రక్తం తాగేస్తున్నాయ్..!



- మారిన వాతావరణంతో దోమల వృద్ధి
- అపరిశుభ్రతతో విజృంభిస్తున్న వైనం
- రోగాలతో ఆస్పత్రులకు జనం క్యూ



బాలాజీ పాఠశాల వెనుక వైపు నిల్వ ఉన్న మురుగునీరు

నల్లమాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మారిన వాతావరణం, వరుస గా కురుస్తున్న వర్షాలతో దోమలు విపరీతంగా వృద్ధి చెంది, ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. పొద్దు వాలిందంటే చాలు జనాలపై వీర విహారం చేస్తున్నాయి. దీంతో అనేక మంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు తీసుకోక పోవడం కూడా దోమల విజృంభణకు కారణమవుతోంది. నల్లమాడ బస్టాండ్ కూడలి సమీపం, పెద్ద మసీదు వీధి, ఎస్సీకాలనీ, రామాలయం వెనుక వీధి, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాలాజీ పాఠశాల వెనుకవైపు ప్రాంతాల్లో నిరంతరం రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. బాలాజీ పాఠశాల వెనుక, బస్టాండ్ కూడలిలోని బ్రిడ్జివద్ద పందులు స్వైరవిహారం చేస్తుంటాయి. అలాగే నల్లమాడ నుంచి చిల్లగోర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి కుంట వద్ద నల్లమాడలోని చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థా పదార్థాలను అక్కడ వేస్తుంటారు. దీంతో ఆ రహదారిలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ముక్కుమూసుకోక తప్పడంలేదని వాపోతున్నారు. ఈ అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వృద్ధి చెంది ప్రజలను పట్టి పీడిస్తున్నాయి.

అటకెక్కిన ఫాగింగ్

కొన్నేళ్ల కిందటి వరకు వైద్య సిబ్బంది పంచాయతీ అధికారుల సహకారంతో మురుగునీటిలో దోమ లార్వా నిర్మూలన కోసం పలురకాల మందులు పిచికారీ చేయించేవారు. అలాగే ఫాగింగ్ చేయించేవారు. ప్రస్తుతం అవన్నీ అటకెక్కాయి. పత్రికల్లో వార్తలు వస్తే మాత్రం పంచాయతీ, వైద్యసిబ్బంది తూతూ మంత్రంగా బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారే తప్ప దోమల నివారణకు చర్యలు చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, పేరుకుపోయిన అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెంది రోగాలు కలుగజేస్తున్నాయి. దీంతో బాధితులు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది దోమల నివారణ కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

కాలువలు ఏర్పాటు చేయడానికి తగినన్ని నిధులు లేకపోవడంతో నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయి. కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే కాలువల నిర్మాణాలకు కృషి చేస్తాం.

-ఆజాద్, ఎంపీడీఓ

మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయండి



నల్లమాడలో గత 20 ఏళ్లుగా పలు వీధుల్లో కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు పారుతోంది. ఈవిషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా, పట్టించుకోవడంలేదు. ప్రధాన రోడ్లపై మురుగు పారుతుండటంతో దోమలు వృద్ధి చెంది, రోగాలు కలుగజేస్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు.

-కుచ్చెపు చంద్ర, సీపీఐ

తొలగని అపరిశుభ్రత



ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నారే కానీ ఎస్సీకాలనీలో అపరిశుభ్రత తొలగడం లేదు. సత్యమ్మ వీధినుంచి మురుగునీరు ఎస్సీకాలనీకి వస్తున్నాయి. చెత్తా, చెదారం పేరుకుపోయింది. కాలనీలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధిచెంది, రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. అధికారులకు వినతులు ఇచ్చినా కాలనీలో మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయలేదు.

-లక్ష్మీనారాయణ, ఎస్సీకాలనీ, నల్లమాడ

టీచర్ల నియామకాలకు

కొత్త విధానం

- డీఎస్సీ టాపర్లు, కటాఫ్, మెరిట్‌లిస్టుకు చెల్లు
- అర్హత అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు..
- రాష్ట్రశాఖ ఆదేశాలు..
- ఏర్పాట్లపై విద్యాశాఖ కసరత్తు

6

డోలమైట్ అక్రమ రవాణాపై

విజిలెన్స్ దాడులు

క్రషర్ల వద్ద అధికారుల తనిఖీలు

6

సమన్వయంతోనే నాణ్యమైన విద్య: కలెక్టర్ చేతన్




మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

గోరంట్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో సాగినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి సాధ్యమవుతుందని కలెక్టర్ చేతన్ తెలిపారు. మండలంలోని నాసిన్ వద్ద ఉన్న కేంద్రియ విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఈనెల 4న తరగతులు ప్రారంభించిన విషయం తెలిసిందే. 2025-26 సంవత్సరానికి బడ్జెట్, అడ్మిషన్లు, సిబ్బంది జీతాలు, పాఠశాల అభివృద్ధి పురోగతిపై విద్యాలయ యాజమాన్యంతో ఆయన సమీక్షించారు. సెప్టెంబరు 2న జరిగే పరీక్షల కోసం రేపటి నుంచి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ద్వారా విద్యాబోధన గురించి తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. విద్యాలయంలో ప్రార్థన మైదానం, బస్‌షెల్టర్, క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో నాసిన్ డిప్యూటీ డైరెక్టర్ శేషు, కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, క్రిష్టప్ప, నాగరాజు, శశికళ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల లావాదేవీలకు యాప్

ఆవిష్కరించిన గ్రామీణాభివృద్ధి అదనపు కార్యదర్శి అనిల్‌కుమార్



మహిళా సంఘం సభ్యులకు చెక్కును అందిస్తున్న అనిల్‌కుమార్

గుడిబండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత దిశగా రూపొందించిన 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌ను కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి టీకే అనిల్‌కుమార్ మండలంలోని కరికెర గ్రామంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ, అదనపు సీఈఓ రామానాయుడు పాల్గొన్నారు. టీకే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. యాప్‌తో మహిళా సంఘాలకు ఆర్థిక లావాదేవీలపై స్పష్టత ఉంటుందన్నారు. పారదర్శకత సాధ్యమన్నారు. సభ్యులు చేసుకున్న పొదుపు, తీసుకున్న అప్పులు, చెల్లించిన కంతుల వివరాలను యాప్‌లో ప్రతి సభ్యురాలు చూసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలోని మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలతో వివిధ రకాల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసి, ఆర్థిక స్వావలంబన సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సంఘాలకు రుణాల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

నాడు-నేడు.. డొల్ల చూడు..!

నాసిరకంగా పనులు

- శింగనమల హైస్కూల్‌లో ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- రూ.లక్షలు వృథా





పెచ్చులూడిన తరగతి గదుల పైకప్పులు

వైసీపీ హయాంలో పాఠశాలల రూపురేఖలు మారుస్తామంటూ పాలకులు గొప్పలు చెప్పారు. నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయలు వెచ్చించి, పనులు చేపట్టారు. నాసిరకంగా పనులు చేసి, నిధులు దోపిడీ చేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలే ఇందుకు నిదర్శనం. పాఠశాలలో కోట్ల రూపాయలు వెచ్చించి, భవనాల మరమ్మతులు చేపట్టారు. రెండేళ్లు తిరక్కుండానే అవి దెబ్బతింటున్నాయి. పాఠశాలలో వైసీపీ పాలనలో నాడు-నేడు కింద భవనాల మరమ్మతులు ఇతర పనుల కోసం రూ.1.98 కోట్ల నిధులు మంజూరు చూశారు. భవనాల పైకప్పులకు ఫ్లోరింగ్, గోడలకు ప్లాస్టింగ్ పనులకు రూ.40 లక్షల మేర బిల్లులు చెల్లించినట్లు సమాచారం. పనులు నాసిరకంగా చేయడంతో రెండేళ్లు తిరక్కుండానే పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. పాఠశాలలోని 8 భవనాల్లో పెచ్చులు ఊడిపడుతుండడంతో ప్రస్తుతం అక్కడ తరగతులు నిర్వహించట్లేదు. ఇతర భవనాల్లో పాఠాలు చెబుతున్నారు. పనులు నాసిరకంగా చేపట్టడమే ఇందుకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, శింగనమల



పాఠశాల ఆవరణలో ఊడిన పెచ్చులను పడేసిన దృశ్యం

విజిలెన్స్ దాడులు

డోలమైట్ అక్రమ రవాణాపై

- క్రషర్ల వద్ద అధికారుల తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

యాడికి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పర్మిట్ల ముసుగులో భారీ దోపిడీ చేస్తున్న శ్రీనివాస మినరల్స్ కార్యాలయం, క్రషర్లపై మంగళవారం కర్నూలు రీజినల్ విజిలెన్స్ అధికారులు, తాడిపత్రి గనులు, భూగర్భ వనరుల శాఖాధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ రీజినల్ ఏడీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతపురం, నంద్యాల జిల్లాల సరిహద్దులో ఉన్న యాడికి మండలం దైవాలమడుగు గ్రామ సమీపాన శ్రీనివాస మినరల్స్ కార్యాలయంలో అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. క్రషర్ల వద్ద నిల్వ ఉంచిన డోలమైట్ ఖనిజాన్ని కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద తనిఖీల్లో అక్రమ పర్మిట్లు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. మూడు లారీల్లో పర్మిట్ల కన్నా అధిక టన్నేజీతో డోలమైట్ ఖనిజాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మూడు లారీలను సీజ్ చేసి, ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఆ లారీల డ్రైవర్లు ఇచ్చిన పర్మిట్ల ఆధారంగా శ్రీనివాస మినరల్స్ నుంచి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. పర్మిట్లలో 10 టన్నులలోపు అనుమతి ఉంటే లారీల్లో 30 టన్నులకుపైగా ఖనిజాన్ని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. డోలమైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రెండ్రోజులుగా శ్రీనివాస మినరల్స్‌లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడి నుంచి పెద్ద మొత్తంలో ఖనిజ అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. క్రషర్ల వద్ద పెద్దఎత్తున డోలమైట్ ఖనిజాన్ని నిలువ ఉంచారనీ, ఎంతమేరకు అన్నది కొలతలు వేస్తున్నట్లు తెలిపారు. ఖనిజం ఎంత నిలువ ఉంది, అక్రమ రవాణా ఎంత మేరకు చేశారన్న వాటిపై లెక్క తేల్చడానికి నాలుగైదు రోజుల పడుతుందన్నారు. దీనిపై నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు శ్రీనివాస మినరల్స్‌పై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. తనిఖీల్లో కర్నూలు అసిస్టెంట్ జియాలజీ ఆఫీసర్ రాజగోపాల్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, తాడిపత్రి రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కవిత, సర్వేయర్ ఉమాదేవి పాల్గొన్నారు.

చైతన్య దీపిక..



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సర్పంచ్ మోనాలిసా (ఫైల్)

- సర్పంచ్ సామాజిక అవగాహన కార్యక్రమాలు
- పాఠశాలలు, హాస్టళ్ల సందర్శన
- బాల్యవివాహాల నష్టాలు, చదువు ఉపయోగాలపై పిల్లలకు అవగాహన
- పిల్లలతోనే పల్లె ప్రగతి అని గట్టి నమ్మకం
- వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాకు జాతీయ స్థాయి పురస్కారం

సామాజిక కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తుంటా



బాల్యవివాహాల నష్టాలు, చదువు ఉపయోగాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటా. పాఠశాలలకు వెళ్లినపుడు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటా. వాటి పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తా. విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని పిల్లలకు తెలియజేస్తా. జాతీయస్థాయిలో పురస్కారం దక్కడం ఆనందంగా ఉంది.

-మోనాలిసా, సర్పంచ్, వజ్రకరూరు

ఉన్నత విద్య
అభ్యసించడంలో..
ఉపాధ్యాయురాలి వృత్తిలో..
ఎన్నెన్నో సమస్యలు దృష్టికొచ్చాయి..
వాటికి పరిష్కారాల దిశగా ఆలోచించారు..
ఊరికి సర్పంచ్ అయ్యారు..
సమాజంలో మార్పునకు ప్రయత్నాలు మొదలెట్టారు..
అవగాహన ఒక్కటే మార్గమని నమ్మారు..
ప్రజల్లో చైతన్యంతోనే పరిష్కారం సాధ్యమనుకున్నారు..
ఓవైపు అభివృద్ధికి చర్యలు చేపడుతూనే..
మరోవైపు అవగాహన కార్యక్రమాలు మొదలెట్టారు..
బడులు, హాస్టళ్లు తిరుగుతూ..
బాల్య వివాహాల అనర్థాలు,
చదువు ఉపయోగాలు వివరించారు..
పిల్లలతోనే పల్లె ప్రగతి సాధ్యమని నమ్మారు..
అదే విషయాన్ని చెప్పి.. శెభాష్ అనిపించుకున్నారు..
వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలిసా.
జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు..

ఉరవకొండ, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పిల్లలతోనే పల్లె ప్రగతి అని గట్టిగా చెప్పి జాతీయస్థాయి పురస్కారం దక్కించుకున్నారు వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మండ్ల మోనాలిసా. భారత నాణ్యతా మండలి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్పంచ్ సంవాద్ పోటీల్లో భాగంగా చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌పై జూలై నెలకుగాను మొదటి బహుమతి గెలుచుకున్నారు. రూ.35 వేల నగదు బహుమతి దక్కించుకున్నారు.

ఉన్నత విద్యావంతురాలు.. బోధనానుభవం

మండ్ల మోనాలిసా ఎంఏ బీఈడీ చదివారు. ఐదేళ్లపాటు కాంట్రాక్టు ప్రాతిపదికన ఆదర్శ పాఠశాలలో టీచర్‌గా పనిచేశారు. 2021లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవంతో పలు అంశాలను స్థానికంగా అమలు చేశారు. ఆమె సమయం దొరికినపుడల్లా సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులోనూ ప్రత్యేకతను చాటుకున్నారు. హాస్టళ్లు, మోడల్ స్కూళ్లను తనిఖీ చేస్తూ, విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. విద్యార్థులకు బాల్యవివాహాల నష్టాలు, చదువుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో న్యూఢిల్లీలో నిర్వహించిన మహిళలకు ప్రాతినిధ్యం-2025 అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రథమస్థానం దక్కించుకున్నారు. జూలైలో సర్పంచ్ సంవాద్ పోటీలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌పై ఒకటిన్నర నిమిషం నిడివిగల వీడియో ద్వారా పిల్లల బాగోగులపై తన అభిప్రాయాలను ఆమె పంచుకున్నారు. అందుకు జాతీయస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. దీంతో ఆమెను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, మేజర్ పంచాయతీ ప్రజలు అభినందించారు. కాగా, సర్పంచ్ మోనాలిసాకు భర్త రాజు, కుమార్తె ఉన్నారు.

సర్పంచ్‌కు అభినందనలు



సర్పంచ్‌ను సన్మానిస్తున్న అధికారులు

జాతీయ స్థాయి పురస్కారం దక్కించుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాకు కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్యకుమారి అభినందిస్తూ లేఖ పంపారు. జిల్లా కలెక్టర్ తరఫున మండల అధికారులు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మోనాలిసాను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ దామోదర్ రెడ్డి, కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

ఆవిష్కరణల కార్ఖానా..!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభిస్తున్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం పర్యవేక్షించారు. జేఎన్టీయూలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఇదే లక్ష్యం..

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ఇందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురంలోని ఇన్నోవేషన్ సెంటర్‌కు కియ, జేఎస్‌డబ్ల్యూ సంస్థల ప్రతినిధులను ప్రచారకర్తలుగా అనుసంధానం చేశారు. సెంటర్ నిర్వహణకోసం సెక్షన్-8 కింద రాష్ట్ర ప్రభుత్వం ఒక సొసైటీని ఏర్పాటు చేసింది. జాయింట్ కలెక్టర్ దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సభ్యులుగా ఉంటారు.

ఆలోచన ఉండాలంతే..

ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ అంశాలను జేఎన్టీయూ పర్యవేక్షిస్తుంది. శిక్షణ పొందిన వారికి ఎలాంటి అవకాశాలు కల్పించాలనేది పారిశ్రామికవేత్తలు నిర్ణయిస్తారు. ఇండస్ట్రీ, యూనివర్సిటీ సంయుక్తంగా ఇన్నోవేషన్ హబ్ నిర్వహిస్తాయి. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని అందుకోనున్నారు. ఏ రంగంలోనైనా కొత్త ఆవిష్కరణ ఆలోచన ఉన్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంజనీరింగ్, బీఎస్సీ, బీకామ్ తదిర డిగ్రీలున్న విద్యార్థులే కాకుండా కొత్త విషయాలపై ఆలోచనా సామర్థ్యం మెండుగా ఉండి, సమాజానికి అందించగలనన్న సంకల్పం ఉంటేచాలు అవకాశం కల్పిస్తారు.

స్కిల్ డెవలప్‌మెంట్..

స్కిల్ డెవలప్‌మెంట్ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఈ సెంటర్ కేంద్రంగా పనిచేయనుంది. యువతకు నైపుణ్య శిక్షణ, వినూత్న ఆలోచనలకు ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ఉపాధి అవకాశాలను సృష్టించడమే దీని లక్ష్యం. ఈ ప్రాజెక్టులో గ్రీన్‌కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. సెంటర్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక బాధ్యత కింద ప్రముఖ పారిశ్రామిక సంస్థలు నిధులను సమకూరుస్తాయి.

యువతకు శిక్షణ

వ్యక్తి వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి అంశాలలో యువతకు శిక్షణ ఇస్తారు. పౌర సేవలందించే ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యంగా ఉండనుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్‌వ్యాలీ, ఏఐ వంటి వాటిల్లో స్టార్టప్‌లకు సహకారం అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ సేవలు అందిస్తుంది. టెక్స్‌టైల్ ఇన్నొవేషన్, ఇంధనం, పునరుత్పాదక ఇంధన రంగాలు, ఫార్మా రంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది.



జేఎన్‌టీయూలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

అవకాశాలకు అడుగులు...

రతన్ టాటా ఇన్నొవేషన్ కేంద్రం ప్రారంభంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడుగులు పడనున్నాయి. విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తును అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. విద్యార్థిలో నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్టీయూ వీసీ

టీచర్ల నియామకాలకు కొత్త విధానం

డీఎస్సీ టాపర్లు, కటాఫ్, మెరిట్‌లిస్టుకు చెల్లు

నేరుగా అర్హత అభ్యర్థులకు మెస్సేజ్‌లు..

రాష్ట్రశాఖ ఆదేశాలు.. ఏర్పాట్లపై విద్యాశాఖ కసరత్తు



అనంతపురం విద్య, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ టీచర్ల నియామకాల విషయంలో ఈ సారి కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. గతంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టు, ఏ కేటగిరీ పోస్టు ఎన్ని మార్కుల వరకు ఆగిపోతుందని కటాఫ్ ఇచ్చేవారు. ఈసారి డీఎస్సీ నియామకంలో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు అలా చేయడంలేదు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటికే డీఎస్సీ ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థుల తమ హాల్ టిక్కెట్‌తో విద్యాశాఖ ఇచ్చిన లింకు ద్వారా ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకున్నారు. దీంతో ఏ సబ్జెక్టులో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయి, ఎవరికి ఎక్కువ వచ్చాయో ఇప్పటికీ అభ్యర్థులకు తెలియలేదు. దీంతో ప్రభుత్వం జిల్లాల వారీగా మెరిట్ లిస్టు విడుదల చేస్తుందనీ అపుడు ఏయే కేటగిరీలో ఎన్ని మార్కులు వచ్చి ఉండుంటే పోస్టు వస్తుందో అభ్యర్థులు సులభంగా లెక్కలు కట్టుకునేవారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ తీసుకున్న కొత్త నిర్ణయం మేరకు డీఎస్సీలో వచ్చిన టాపర్లు, మెరిట్ లిస్టు, కటాఫ్ వివరాలను విడుదల చేయడంలేదు. కేవలం పోస్టులు, కేటగిరీల ఆధారంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గుర్తిం చి అర్హత పొందిన అభ్యర్థులకు మాత్రమే మెస్సేజ్‌లు పంపనున్నారు.

- రాష్ట్రశాఖ నుంచి మెస్సేజ్‌లు వచ్చిన అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నారు. రేపో, ఎల్లుండో పరిశీలన కొనసాగించాలనీ, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖకు రాష్ట్ర కమిషనర్ నుంచి ఆదేశాలు పంపారు. దరఖాస్తుల పరిశీలనకు నియమించిన కమిటీలకు మంగళవారం రాష్ట్ర శాఖ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారనీ, ప్రతి కమిటీలో ఒకరిని పంపాలని రాష్ట్ర శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ దరఖాస్తుల పరిశీలనకు 16 కమిటీలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ముగ్గురు ఉన్నారు. అందులో ఒకరిని శిక్షణకు పంపడానికి చర్యలు చేపట్టారు. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఇప్పటికే డీఈఓ ప్రసాద్‌బాబు, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్‌తో కూడిన బృందం జిల్లాలో డీఎస్సీ ఖాళీల జాబితాను తీసుకెళ్లింది. దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాట్లు, శిక్షణకు పంపాలని ఆదేశాలు రావడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు. మొత్తం మీద ఈసారి టీచర్ల నియామకాల్లో టాపర్లు,మెరిట్ లిస్టు, కటాఫ్ విడుదల చేయకుండానే అభ్యర్థులను నేరుగా రాష్ట్రశాఖ మెస్సేజ్‌ల రూపంలో తెలియజేసి వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు ఆహ్వానించి నియామకాలు చేపడుతుండడంపై అధికారులు, అభ్యర్థుల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

మట్టి దోపిడీ..!

(5వ పేజీ తరువాయి)


అధికారులు అనుమతులు ఇచ్చారు. అనధికారికంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.

చెల్లించేది గోరంత...

మట్టి తవ్వకాల విషయంలో ప్రభుత్వానికి తక్కువ చెల్లించి ఎక్కువ దోపిడీ చేస్తున్నారు. క్యూబిక్ మీటర్‌కు రూ.200 సీనరేజీ ఫీజు, రవాణాకు టన్నుకు రూ.55 మాత్రమే చెల్లిస్తున్నారు. టిప్పర్‌కు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు, ట్రాక్టర్‌కు రూ.3వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. అనుమతి తీసుకున్న లీజుదారులు కొంత పరిధి దాటి అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని సమాచారం. ఇక అనుమతులు లేకుండానే జిల్లా వ్యాప్తంగా భారీగా తవ్వకాలు చేపడుతున్నారు.

రాయల్టీ ఇన్‌స్పెక్టర్ల ముసుగులో వసూళ్లు

మట్టి తవ్వకాల్లో అనేక రకాలున్నాయి. గ్రామాల పరిధిలో ఎక్కువగా పొలాల్లో మార్పు కోసం మట్టిని తవ్వుతుంటారు. ఇక వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు అధికంగా వాడుతుంటారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ల (ఆర్‌ఐ) ముసుగులో కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్‌ఐల అసిస్టెంట్లమని చెప్పి గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా ట్రాక్టర్లతో మట్టి తరలిస్తుంటే రూ.2వేల నుంచి రూ.3వేలవరకు వసూలు చేస్తుంటారు. వెంచర్లకు తవ్వుతుంటే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.



గార్లదిన్నె మండలం కల్లూరులో వీఆర్వోలపై దాడి జరగడంతో అక్కడికెళ్లిన పోలీసులు (ఫైల్)

జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాల్లో కొన్ని..

- గార్లదిన్నె మండలం కల్లూరు సమీపాన ఎక్స్‌కవేటర్‌తో తవ్వి, ట్రాక్టర్లు, టిప్పర్లతో వెంచర్లకు మట్టి తరలించారు. ఇక్కడ తవ్వకాలకు అధికారుల అనుమతి లేదు. మట్టి తవ్వుతుండగా వారంరోజుల క్రితం స్థానికంగా ఉన్న ఇద్దరు వీఆర్వోలు అడ్డుకున్నారు. వారిపై మట్టి తవ్వకాల్లో కీలకంగా ఉన్న టీడీపీ నాయకులే దాడి చేశారు. అయినా పోలీసులు జోక్యం చేసుకోలేదు.
- అనంతపురం నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లోని కొండలను భారీగా తవ్వేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం మట్టిని టిప్పర్లలో తరలిస్తున్నారు.
- అనంతపురం రూరల్ మండలం చియ్యేడు, క్రిష్ణమరెడ్డిపల్లి, నరసనాయనికుంట, పూలకుంట, ఆలమూరు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వాటి నుంచి లేఅవుట్లకు సరఫరా చేస్తున్నారు. తాటిచర్ల ఎర్రమట్టి తవ్వకాలకు అనుమతులున్నా సమీపంలో తాజాగా ఓ ఇరిగేషన్ అధికారి సాయంతో నల్లమట్టి తవ్వారు. వర్షాలు కురుస్తుండటంతో ఈ మధ్యనే ఆపేశారు.
- బుక్కరాయసముద్రం సమీపాన, శింగనమల మండలం కొరివిపల్లి, నార్పల మండలం మదుగుపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. వీటికి అనుమతులే లేకపోవడం గమనార్హం.
- రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి వద్ద 2 హెక్టార్ల వరకు అనుమతి ఉన్నా... అంత కంటే ఎక్కువే గత ప్రభుత్వ హయాంలో తవ్వేశారు.
- గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు సమీపాన జాతీయ రహదారి పక్కన, పామిడి మండలంలో కొన్ని గుట్టలను తవ్వి మట్టి తరలిస్తున్నారు.
- యాడికి మండలంలోని యాడికి-తిరుణాంపల్లి రోడ్డు పక్కనున్న 40ఎకరాల గుట్టలో మట్టిని రియల్ వ్యాపారులు తవ్వేశారు.
- ఉరవకొండ సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువకు సంబంధించిన మట్టి తరలిస్తున్నారు. అనుమతులు లేకపోయినా ఓ వైసీపీ నాయకుడి వెంచర్‌కు ట్రాక్టర్లతో సరఫరా చేస్తున్నారు.
- డీ హిరేహాళ్ మండలంలోని కర్ణాటక సరిహద్దులో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. బళ్లారి-బెంగళూరు రహదారి నిర్మాణంలో మట్టిని వాడుతున్నారు.



యాడికి మండలంలో 40 ఎకరాల్లోని గుట్టలో మిగిలింది ఇదే..

అక్రమ తవ్వకాలు నిజమే...



జిల్లాలో కొన్నిచోట్ల అక్రమ తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికొచ్చింది. పది నెలలుగా రూ.15లక్షల వరకు జరిమానా విధించాం. సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో దాడులు చేయలేకపోతున్నాం. అనుమతి లేకుండా మట్టిని రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం.

- ఆదినారాయణ, గనుల శాఖ ఇన్‌చార్జి ఏడీ

కోర్టులో ఉద్యోగాలకు నేటి నుంచి పరీక్షలు

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఆధ్వర్యంలో స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఎగ్జామినర్, ఫీల్డ్ అసిస్టెంట్, కాపీయిస్టు, ప్రాసెస్ సర్వర్, డ్రైవర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి బుధవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలు గేట్లు 15 నిమిషాల ముందే మూసివేస్తారని, అభ్యర్థులు గమనించి, త్వరగా చేరుకోవాలని సూచించారు. గేట్లు మూసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించబోమని అన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో ఉన్న గుర్తింపుకార్డులు, హాల్‌టిక్కెట్లు తీసుకెళ్లాలని సూచించారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్, ఇతర సమస్యలు ఉంటే 0863-237252 నంబరకు ఫోన్ చేయాలని, లేదంటే helpdesk.hc.ap@aij.gov.in మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షే తుది పరీక్ష అని, మౌఖిక పరీక్ష ఉండదని, అభ్యర్థులు గమనించాలని సూచించారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, టైపిస్టు, కాపీయిస్టు, డ్రైవర్(లైట్ వెహికల్) పోస్టులకు స్కిల్ టెస్టు ఉంటుందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులను స్కిల్ టెస్టుకు రావాలని సమాచారం అందిస్తారని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయి.

సెల్‌ఫోన్ రిపేరీ కోసం వెళ్లి మృత్యువాత

ఆటో బోల్తాపడి విద్యార్థి మృతి



నందకిషోర్ (ఫైల్)

ముదిగుబ్బ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనగారిపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఆటో బోల్తాపడి వీసీరేవు గ్రామానికి చెందిన విద్యార్థి నందకిషోర్(14) మృతి చెందినట్లు ముదిగుబ్బ పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్ రిపేరీ కోసం నందకిషోర్ మరికొందరితో కలిసి ఆటోలో ముదిగుబ్బకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సిద్ధనగారిపల్లి గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన నందకిషోర్‌ను స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆటో మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడు ఉప్పలపాడు బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి వేణుగోపాల్(66) హౌసింగ్ బోర్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించారు. ఓ అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తన భర్త మరణించారంటూ మృతుడి భార్య నాగరత్నమ్మ ట్రాఫిక్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తన భర్త వేణుగోపాల్ సోమవారం విద్యుత్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి గుడికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. 8.30 గంటలప్పుడు కుమార్ ఆసుపత్రి వద్దకు రాగానే ఏపీ 39-టీఎస్0767నెంబర్ అంబులెన్స్ కుడి వైపు డోర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా తెరవడంతో అది స్కూటర్‌కు తగిలి కింద పడి గాయపడ్డాడన్నారు. తొలుత కుమార్ ఆసుపత్రికి, తర్వాత సవీరా ఆసుపత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు యాక్సిడెంట్‌కు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను సేకరించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం... బాలుడి దుర్మరణం

కనగానపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో ఓ టిప్పరు డ్రైవరు నిర్లక్ష్యం ఓ బాలుడు ప్రాణం తీసింది. స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా సోలేపల్లికి చెందిన రామాంజనేయలు తన కుమారుడు వినయ్(7)తో కలిసి ద్విచక్ర వాహనంపై అనంతపురం నుంచి సొంతూరికి వెళుతున్నాడు. తల్లిమడుగుల వద్ద ముందు వెళుతున్న టిప్పర్ ఆగింది. దీంతో వెనకున్న రామాంజనేయలు తన ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా పోనిచ్చాడు. అయితే ఎదురుగా మరో టిప్పరు రావడంతో అకస్మాత్తుగా టిప్పరు డ్రైవర్ తన వాహనాన్ని వెనకకు రివర్స్ చేశాడు. దీంతో వెనుక ద్విచక్రహానంపై ఉన్న తండ్రి, కొడుకు కింద పడ్డారు. టిప్పర్ వెనుకకు రావడంతో దానికింద పడి వినయ్ అక్కడికక్కడే మృతిచెందగా తండ్రి రామాంజనేయలు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవులో జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ వారం రోజులపాటు వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. దీంతో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ 10 రోజులపాటు సెలవు కోరితే వారం రోజులే మంజూరు చేశారన్న చర్చ జరుగుతోంది. ఈక్రమంలో మరోసారి సెలవు పొడిగించుకొనే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

మార్పు వద్దా..?

- మార్పు ద్వారా విజేతలు శిక్షణకు ఇద్దరే హాజరు..

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రజాప్రతినిధులను చైతన్యపరిచేందుకు ప్రభుత్వం చేస్తున్న యత్నాలు సఫలం కావడం లేదు. మార్పు ద్వారా విజేతలు.. మహిళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇదివరకే రెండు విడతల్లో శ్రీ కాళహస్తిలో కొందరికి శిక్షణ ఇచ్చారు. అయితే మిగిలిన వారికి మంగళవారం నుంచి గురువారం వరకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. దాదాపు 50 మంది దాకా వస్తారని అధికారులు అంచనా వేయగా గాండ్లపెంట, రాప్తాడు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన రెండు రోజులకు అయిన మహిళా సభ్యులు హాజరు కావాలని సమాచారం అందించారు. తమకు పదవీకాలం ఇక ఏడాదిలోపే ఉందన్న కారణంతో చాలా మంది శిక్షణకు రాలేదన్న ప్రచారం జరుగుతోంది.

24న టీటీసీ థియరీ పరీక్షలు

అనంతపురం విద్య, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): టీటీసీ థియరీ పరీక్షలు ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ వెంకటేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మళ్లీ 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటలవరకు మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాకేంద్రంలోని మొదటి రోడ్డులోగల శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. హాల్‌టిక్కెట్ తోపాటు ఏదైనా గుర్తింపు కార్డుతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం వేధింపుల ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన తుంగా రేఖకు, కొత్తపేటకు చెందిన రంగం ఆంజనేయులుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో 14 తులాల బంగారం ఇచ్చారు. ఆంజనేయులు పట్టుచీరల వ్యాపారం చేస్తున్నాడు. వీరికి పిల్లలు లేరు. పెళ్లయిన మూడునెలల వరకు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత ఆంజనేయులు వ్యసనాలకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ భార్య బంగారమంతా బ్యాంకులో తాకట్టు పెట్టాడు. విషయాన్ని తుంగా రేఖ.. అత్తమామలకు చెప్పినా వారు కూడా ఆంజనేయులుకు మద్దతు పలికారు. విషయాన్ని తుంగా రేఖ తన తల్లిదండ్రులకు చెప్పగా వారు పంచాయితీ పెట్టి చెప్పినా ఎటువంటి మార్పు రాలేదు. రెండేళ్లుగా భర్త, అత్తమామలు అదనంగా డబ్బులు కావాలని తుంగా రేఖను వేధిస్తుండేవారు. దీంతో రేఖ పుట్టింటికి వచ్చేసింది. అయినా ఆంజనేయులు వేధింపులు ఆగలేదు. వాటిని భరించలేక మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఆమె భర్త ఆంజనేయులు, అత్త లక్ష్మీదేవి, మామ రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

పగలు బొగ్గులు.. రాత్రి దోపిడీలు

పాణ్యం ముఠాకు రాయచోటి వ్యక్తి సాయం

చెక్కవారిపల్లి నుంచి నెలకు సరిపడా సరుకులు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చెక్కవారిపల్లి అటవీ ప్రాంతంలో పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా వ్యవహారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతంలో ఈ ముఠా ఆరు నెలలుగా గుడారాలు వేసుకుని ఉంటోంది. తనకల్లు, కదిరి రూరల్, పాణ్యం పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి వీరిని పట్టుకున్నారు. వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్‌ల నిఘా పెట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా వీరు తనకల్లు మండలంలోని దిగువ చెక్కవారిపల్లికి చేరినట్లు సమాచారం. అక్కడి నుంచి నెల క్రితం అటవీప్రాంతానికి మకాం మర్చారు. వీరందరూ నంబులపూలకుంట మండలం పెడుల్లి వద్ద బొగ్గులు కాల్చే పనికి వెళ్లేవారు. వీరికి చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రతి నెలా తినడానికి కావలసిన సరుకులు వెళ్లేవని సమాచారం. రాయచోటికి చెందిన శేఖర్‌కు చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారానే శేఖర్ దొంగల ముఠాకు సాయం అందించాడని సమాచారం. పగటిపూట బొగ్గులు కాల్చి, రాత్రిళ్లు దోపిడీలకు పాల్పడేవారని సమాచారం.

విడపనకల్లు వెళ్లాలంటే.. టిక్కెట్ కొనాల్సిందే..!

స్త్రీ శక్తికి దూరంగా మండలం

ఒక్క ఉచిత బస్సు సర్వీసూ నడపని ఆర్టీసీ

మహిళలపై భారం



బస్సు బోర్డుపై అంతర్రాష్ట్ర సర్వీసు అని రాసిన దృశ్యం

విడపనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ యోగం దక్కట్లేదు. ఒక్క ఉచిత బస్సు సర్వీసు కూడా లేకపోవడమే ఇందుకు కారణం. కర్ణాటక సరిహద్దులో మండలం ఉండడమే ఇందుకు కారణం. మండలం మీదుగా బళ్లారి, అనంతపురం మధ్య రోజూ వంద బస్సులుపైగా తిరుగుతుంటాయి. అవన్నీ ఎక్స్‌ప్రెస్‌లు, అల్ట్రా డీలక్స్ బస్సులే. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ బస్సులను ప్రకటించిన తరువాత ఈ బస్సులు అన్నింటికీ అంతర్రాష్ట్ర సర్వీసులుగా బోర్డులు తగిలించారు. దీంతో మండలంలోని మహిళలకు ఉచిత ప్రయాణ యోగం లేకుండా పోయింది. విడపనకల్లు నుంచి ఉరవకొండకు వెళ్లాలన్నా అంతర్రాష్ట్ర సర్వీసుల్లో టిక్కెట్ కొనాల్సిందే. అనంతపురం నుంచి విడపనకల్లు రావాలన్నా ఉరవకొండ వరకు మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుంది. అక్కడి నుంచి విడపనకల్లుకు టిక్కెట్ కొనాల్సిందే. విడపనకల్లుకు ఒక్క పల్లె వెలుగు సర్వీసు కూడా లేదు. విడపనకల్లు వరకూ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని మండలానికి చెందిన మహిళలు కోరుతున్నారు.

విడపనకల్లుకు టిక్కెట్ తీసుకోవాల్సిందే

విడపనకల్లు మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఫ్రీ సర్వీసులు లేవు. ఉరవకొండ నుంచి విడపనకల్లు మీదుగా అన్ని బస్సులు బళ్లారికి వెళ్తుండటంతో అవి అంతర్రాష్ట్ర సర్వీసుల కిందకు వస్తాయి. వాటిలో ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. సరిహద్దు వరకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే చర్యలు తీసుకుంటాం.

-హంపయ్య, డిపో మేనేజర్, ఉరవకొండ

ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

కళ్యాణదుర్గం (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పట్ల మహిళలు ఆనందంగా ఉన్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళల వద్దకెళ్లి ఉచిత ప్రయాణం ఎలా ఉందంటూ ఆర్టీసీ ఎండీ అడిగి తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణంతో డబ్బులు ఆదా అవుతున్నాయనీ, ఎంతో సంతోషంగా ఉన్నామని వారు చెప్పారు. ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ 93 శాతానికి పెరిగిందన్నారు. కొన్ని ఆర్టీసీ డిపోల్లో 106 శాతం ఆక్యుపెన్సీ వచ్చినట్లు తెలిపారు. కర్ణాటక సరిహద్దు మండలాలకు ఉచిత ప్రయాణం అమలు కావడంలేదనీ, అవకాశం కల్పించాలని ప్రయాణీకులు.. ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సులో మహిళతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ

తాడిపత్రి వైపు పెద్దారెడ్డి.. అడ్డుకున్న పోలీసులు

అనంతపురానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే

తాడిపత్రి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వైపు వెళ్తున్నాడన్న సమాచారంతో పోలీసుల్లో హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది. చుట్టుపక్కల పోలీసు స్టేషన్లతోపాటు సిబ్బందిని అలర్ట్ చేసి, ఆయా రహదారుల్లో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పెద్దారెడ్డి మాత్రం యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రి వైపు రావడంతో బుక్కాపురం వద్ద పోలీసులు అడ్డగించారు. తాను అనంతపురం వెళ్తున్నానని చెప్పినా వారు ఒప్పుకోలేదు. ఆయన కాన్వాయ్ వెంబడే బయలుదేరారు. కొండాపురం సమీపంలో సూరేపల్లి వద్దకు రావడంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రికి వెళ్లకూడదనీ, వెనక్కి వెళ్లాలని చెప్పినా ఆయన వినలేదు. కోర్టు అనుమతి ఉందనీ, తనను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు మాత్రం ససేమిరా అన్నారు. అంతలోనే మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అనంతపురం నుంచి తిరిగి వస్తున్నాడని తెలియడంతో ఎదురుపడితే ఘర్షణ పడే అవకాశం ఉందన్న ఆలోచనతో పెద్దారెడ్డిని అరగంట ఆపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కొండాపురం దాటి వెళ్లిన తర్వాత అనంతపురం వైపు పెద్దారెడ్డిని పంపించారు. మళ్లీ వెనక్కి వస్తాడేమోనని పోలీసులు కాన్వాయ్‌తోపాటు అనంతపురం వరకు వెళ్లారు. ఆయన తిరిగి రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

కిటకిటలాడిన అంజన్న ఆలయాలు

గుంతకల్లు/బొమ్మనహాళ్/డీ.హీరేహాళ్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస చివరి మంగళవారాన్ని పురస్కరించుకుని గుంతకల్లు సమీపంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం, డీ.హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. నెట్టికంటి మూల విరాట్టుకు వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలతో అలంకరించారు. రాత్రి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఉంచి.. ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. నేమకల్లులో స్వామి వారికి తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురడి ఆంజనేయస్వామిని వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు.



కసాపురం



నేమకల్లు



మురడి


తహసీల్దార్ కార్యాలయంలోనే

వీఆర్ఏ ఆత్మహత్యాయత్నం

భూమి వివాదంలో వీఆర్వో, మునుపటి తహసీల్దార్ అన్యాయం చేశారని ఆరోపణ

నల్లచెరువు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే ఓరువాయి వీఆర్ఏ రంగస్వామి మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన వీఆర్ఏ రంగస్వామికి, దాయదులకు కొన్నేళ్లుగా భూవివాదం ఉంది. కోర్టుకు కూడా వెళ్లారు. సర్వే నంబరు 396/1, 396/2లో తనకు రావలసిన హక్కు భూమిని కూడా ఓరువాయి వీఆర్వో నిర్మల, గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన రవికుమార్ కలిసి మరొకరి పేరున పాసుపుస్తకం జారీ చేశారని బాధిత వీఆర్ఏ ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై అధికారుల వద్దమొరపెట్టుకున్నా, న్యాయం చేయలేదన్నారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించానన్నారు. గమనించిన తోటి ఉద్యోగులు నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కదిరి ఆస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. భూవివాదంపై వీఆర్వో నిర్మల మాట్లాడుతూ.. రంగస్వామి భూమి వివాదం కోర్టులో నడుస్తోందన్నారు. కోర్టులోఉన్న భూమికి ఇంజక్షన్ ఆర్డర్ లేకపోవడంతో ఉన్నతాధికారుల సలహా మేరకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే చేశామన్నారు. రంగస్వామి సాగు విస్తీర్ణం కంటే అండగళ్‌లో ఎక్కువ భూమిని ఎక్కించుకున్నారన్నారు. రంగస్వామి దాయాదులు, పెద్ద మనుషుల సమక్షంలో హక్కు ఉన్న మేరకు పాసుపుస్తకంలో ఎక్కించామన్నారు.

కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్ఏ రంగస్వామి



డాక్టర్ కత్తి పద్మారావుకు

జీవిత సాఫల్య పురస్కారం



అనంతపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసి చేసిన సాహితీవేత్త, సంస్కృతాంధ్ర పండితులు డాక్టర్ కత్తి పద్మారావును విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం వరించింది. 2025 సంవత్సరానికి ఆయనను పురస్కారానికి ఎంపిక చేశారు. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి(రాయలసీమ), కేపీ అశోక్‌కుమార్(తెలంగాణ), గంటేడ గౌరునాయుడు(కోస్తా) న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, డాక్టర్ కత్తి పద్మారావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో త్వరలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తామని విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసమితి వ్యవస్థాపకులు డాక్టర్ శాంతినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ కత్తి పద్మారావుకు పురస్కారం, నగదు బహుమతి అందజేసి సత్కరిస్తామని ఆయన తెలిపారు.

హిందూపురంలో

వందే భారత్ ఆగుతుంది: సోమన్న

బర్కత్‌పుర, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరం నుంచి హిందూపూర్ వెళ్లే ప్రయాణికులకు శుభావార్త చెప్పారు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20703) హిందూపూర్‌లో ఆగుతుందని (హాల్టింగ్) మంత్రి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీనిని రైల్వే బోర్డు ఆమోదించినట్లు తెలిసింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉదయం 5.45 నిమిషాలకు బయల్దేరి మహబూబ్‌నగర్‌కు ఉదయం 6.54 నిమిషాలకు కర్నూలు ఉదయం 8.28 నిమిషాలకు, అనంతపురానికి ఉదయం 10.43 నిమిషాలకు, ధర్మవరానికి ఉదయం 11.10 నిమిషాలకు చేరుతుంది. హిందూపూర్‌కు ఉదయం 11.40 నిమిషాలకు చేరే అవకాశం ఉంటుంది. ఈ రైలు యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 2.45 నిమిషాలకు బయల్దేరి రాత్రి 11గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఏ తేదీ నుంచి వందే భారత్ రైలు హిందూపురంలో ఆగుతుందో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

చిరుజల్లులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, కూడేరు, శింగనమల, విడపనకల్లు, బొమ్మనహాళ్, గుత్తి, పుట్లూరు, పామిడి, గార్లదిన్నె మండలాల్లో చిరుజల్లులు రాలాయి. సోమవారం 18 మండలాల్లో వర్షం పడింది. బెళుగుప్పలో 0.64 సెం.మీ., యాడికి, కళ్యాణదుర్గం 0.60, బ్రహ్మసముద్రం 0.52, తాడిపత్రి 0.42, బుక్కరాయసముద్రం 0.32, డి హీరేహాళ్ 0.24, రాయదుర్గం, కూడేరు 0.22, విడపనకల్లు 0.2, గుత్తి, గుమ్మఘట్ట 0.18, గుంతకల్లు, పామిడి, యల్లనూరు 0.14 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 0.12 సెం.మీ. లోపు కురిసింది.

చేనేత కార్మికుడి అదృశ్యం



మురళి (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మురళి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మకాలనీలో మురళి, కుంటిమద్ది రమ్య దంపతులు జీవిస్తున్నారు. మనస్పర్థల కారణంగా ఇటీవలిగా దంపతులు గొడవపడేవారు. మురళి మగ్గం పని గిట్టుబాటు కాక అప్పులు చేశాడు. వాటిని కట్టలేక ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఒకటిన్నర నెల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రమ్య.. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద గాలించింది. ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

హిందూపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బాలికను బెదిరించి, అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి సుధాకర్‌కు అనంతపురం పోక్సో కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. హిందూపురం పట్టణంలోని లక్ష్మీపురంలో ఉంటున్న వడ్డె సుధాకర్ 2022 జనవరి 7న 15 ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి బెంగళూరుకు, అక్కడి నుంచి కదిరికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో వన్‌టౌన్ సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ దాదాపీర్ కేసు నమోదు చేశారు. బెంగళూరులో ఉన్న సుధాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువైందని న్యాయాధికారి చిన్నబాబు ప్రకటించారు. అత్యాచారం చేసినందుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, బాలికను బెదిరించినందుకు మరో మూడేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించారు. బాధితురాలి తరపున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదించారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐని ఎస్పీ రత్న అభినందించారు.

ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలోని బీ ఫార్మసీ, ఫార్మా డీ, బీబీఏ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, ప్రొఫెసర్లు శివకుమార్, శంకరశేఖర్ రాజు, శ్రీధర్, అంకారావు ఫలితాలను వెల్లడించారు. బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా డీ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ, బీబీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. జేఎన్‌టీయూఏ వెబ్ సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని ఆచార్య నాగప్రసాద్ నాయుడు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 13న నిర్వహించనున్నట్లు శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై అన్నిశాఖల అధికారులతో వారు మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత ప్రజాప్రయోజన వ్యాజ్య న్యాయ సేవలు వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎంబీఓపీ కేసులు, కొళాయి పన్ను కేసులు, ఇంటి పన్ను కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేయాలని అధికారులకు సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశ గడువు పొడిగింపు

కొత్తచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశ గడువును సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో చేరే వారికి 14 సంవత్సరాలు, ఇంటర్‌లో చేరే వారికి 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఈ అవకాశం అపరాధ రుసుం రూ.200 చెల్లించిన వారికి మాత్రమే లభిస్తుందన్నారు. సమాచారం కోసం ఏఐ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

పురంలో అదృశ్యం.. కర్ణాటకలో మృతి



అర్చన (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకంఠపురం కాలనీకి చెందిన అర్చన(27) కర్ణాటకలో మృతిచెందారు. ఈ నెల 13న క్యాటరింగ్ పనులకు వెళ్లిన అర్చన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త నాగరాజు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, కర్ణాటకలోని మంచేపల్లిలో గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు అక్కడి పోలీసులు మంగళవారం సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి.. మృతదేహం అర్చనదేనని గుర్తించారు. ఆమెకు ఇన్‌స్టాలో ఒకరు పరిచయమయ్యారని, అతనే హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. అర్చనకు రెండేళ్ల కూతురు ఉంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ కరీం అన్నారు.

గొలుసు లాక్కెళ్లిన కేసులో ఇద్దరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్కూటీలో వెళ్తున్న మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను త్రీటౌన్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి గొలుసు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక స్టేషన్‌లో త్రీటౌన్ సీఐ శాంతిలాల్ వెల్లడించారు. కంబం నాగార్జున (25) అలియాస్ నాగార్జున రెడ్డి అలియాస్ చిన్నా ఆటో డ్రైవర్. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ సొంతూరు. అనంతపురంలోని కలెక్టరేట్ వద్ద నివాసం ఉంటున్నాడు. పేకాట, తాగుడుకు బానిసయ్యాడు. ఆన్‌లైన్ జూదంలోనూ డబ్బులు పోగొట్టుకున్నాడు. జల్సాల కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. అతడి స్నేహితుడు శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడకు చెందిన బోజనోల వరప్రసాద్ కదిరిలో నివాసం ఉంటున్నాడు. నాగార్జున.. ఫ్రెండ్ వరప్రసాద్‌ను పిలిచి సులభంగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్ చేద్దామంటూ సలహా ఇచ్చాడు. ఇద్దరూ ఈ ఏడాది జూన్ 21న నేషనల్ పార్కు వద్ద చైన్ స్నాచింగ్‌కు ప్లాన్ వేసుకున్నారు. అక్కడ స్కూటీపై ఇద్దరు మహిళలు వెళ్తుండగా వెంబడించారు. స్కూటీ దగ్గరకు వెళ్లి స్కూటీ వెనుక చక్రంలో గాలి తగ్గిందంటూ చెప్పారు. మహిళ స్కూటీ ఆపి, కిందకు దిగి చూస్తుండగానే.. ఆమె మెడలోని బంగారు తాళి బొట్టు చైన్ లాగేసుకుని పారిపోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన సీఐ శాంతిలాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఆర్టీసీ స్టాండ్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 23 గ్రాముల బంగారు చైన్, 1.5 గ్రాముల బంగారు తాళిగొట్టు, బంగారు లక్ష్మీ కాసు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కదిరి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమనాయునిపాళ్యం వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి దాదాపు 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి ఎక్కడనుంచి వ స్తోంది, ఎవరికి విక్రయిస్తున్నారన్న దానిపై పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

న్యూస్ బాక్స్

పాడి రైతులకు సబ్సిడీ దాణా పంపిణీ

బత్తలపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అప్రాచెరువు గ్రామంలో మంగళవారం పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి పాడిరైతులకు సబ్సిడీ దాణా పంపిణీ చేశారు. అలాగే 75శాతం సబ్సిడీతో పశుగ్రాసం విత్తనాలు ఇస్తున్నామని, పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డ్‌కు స్థలం చూపాలని వినతి

కొత్తచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డ్ కోసం కొత్తచెరువు పంచాయతీకి స్థలం కేటాయించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులుకు స్థానిక సర్పంచ్ రాధానాగరాజు, ఈఓ శ్రీనివాసరెడ్డి, వార్డు మెంబర్లు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. డంపింగ్ యార్డ్ లేకపోవడంతో రోడ్లపక్కన, కాలువగట్లపైన, ఇతర ప్రదేశాల్లో పారవేస్తున్నామని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.

ఫసల్‌బీమా గడువు పొడిగింపు: ఏఓ

తాడిమర్రి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి ప్రీమియం చెల్లించే గడువును ఈ నెలాఖరు వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్టు వ్యవసాయ శాఖ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. సంబంధిత బ్యాంకులోని నెఫ్ట్ ద్వారా ప్రీమియం చెల్లించాలని ఆయన తెలిపారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన సామకోటి



పల్లా శ్రీనివాస్‌తో సామకోటి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను మంగళవారం పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కలసి దుశ్శాలువతో సత్కరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన సూచించినట్లు సామకోటి తెలిపారు.

'సమావేశాలు కాలక్షేపానికా..?'

కొత్తచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సమావేశాలు నిర్వహిస్తోంది సమస్యల పరిష్కారానికా లేక కాలక్షేపానికా అని పలువు వార్డు సభ్యులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ రాధ అధ్యక్షతన ఈఓ శ్రీనివాసరెడ్డి అభివృద్ధి పనులపై వార్డు మెంబర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు మెంబర్లు మాట్లాడుతూ... తాము తమ వార్డులలోని సమస్య లను పరిష్కరించాలని గత సమావేశంలో తెలిపినా, ఇప్పడి వరకు మీరు పట్టించుకోలేదన్నారు. తాము ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ఈఓను ప్రశ్నించారు. చెత్తను తరలించే ట్రాక్టర్‌కు ట్రాలీని ఏర్పాటు చేయాలని వార్డు మెంబరు రవి ఈఓను కోరారు. ఇకపై సమస్యలు పరిష్కరిస్తేనే తాము సమావేశానికి వస్తాం లేకపోతే రామని వార్డు సభ్యులు అన్నారు.

ఉద్యోగాలకు 48 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సోమ, మంగళవారాల్లో హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 48 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మొత్తం 250 మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఏడు కంపెనీల ప్రతినిధు హాజరై అభ్యర్థుల ఇంటర్వ్యూ నిర్వహిం చి, 48 మందిని ఎంపికచేశారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ చిన్నపరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణంహర్షవర్ధన్ ఆఫర్ లెటర్లను అందజేసి అభినందించారు. కళాశాల ఇన్‌చార్జ్ రమేశ్, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ శ్రీనివాస్, అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణయ్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు

కదిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ మహిళ హ్యాండ్ బ్యాగు నుంచి బంగారం చోరీపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ముదిగుబ్బ మండలకేంద్రంలోని చెలిమిబావి వీధికి చెందిన హేమలత, ఆమె భర్త సురేంద్ర ఈనెల 16న గోరంట్ల వెళ్లేందుకు తమ కుమార్తె హేమలతతోపాటు కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో హిందూపురం బస్సు ఎక్కుతున్నారు. ఆ సమయంలో హేమలత హ్యాండ్‌బ్యాగ్‌లోని హ్యాండ్ బ్యాగులో ఉన్న ఐదు తులాల బంగారం గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగలించినట్లు బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నల్లచెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో మంగళవారం ఆటో... లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నజీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు చెందిన నజీర్ గొర్రెల వ్యాపారి. అతడు ఆటోలో గొర్రెలు వేసుకుని కదిరి నుంచి మొలకలచెరువుకు వెళ్తున్నాడు. నల్లచెరువు సంత తోపు వద్ద ముందు వెళ్తున్న లారీని ఆటో ఢీకొని బోల్తాపడింది. నజీర్‌కు తీవ్రగాయాలు కాగా రెండు గొర్రెలకు కాళ్లు విరిగాయి. గాయపడిన నజీర్‌ను 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అన్నమయ్యజిల్లాలోని మదనపల్లిలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బస్సులు ఢీ



ఢీకొన్న ఆర్టీసీ, పాఠశాల బస్సులు

కొత్తచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బుక్కపట్నం రహదారి సమీపంలో ఉన్న నల్లమ్మ ఆలయం మలుపులో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు, ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొన్నాయి. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. ఆ మలుపులో ఇరు వాహనాల డ్రైవర్లు హారన్ కొట్టకుండా ఎదురెదురుగా వచ్చారు. అయితే ఇరువురూ సడన్ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో విద్యార్థులు భయపడి కేకలు వేశారు. చుట్టుపక్కల వారు బస్సుల వద్దకు పరుగులు తీశారు. సంఘటనను చూసి విద్యార్థుల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉండేదని స్థానికులు ఆ రెండు బస్సుల డ్రైవర్లను మందలించారు.

నిధులున్నా... సౌకర్యాలు సున్నా

- పాఠశాలల్లో అర్ధాంతరంగా ఆగిన 'నాడు- నేడు' పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మొండిగోడలకు పరిమితమైన ఎన్పీకుంట ప్రాథమిక పాఠశాల

నంబులపూలకుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'నాడు - నేడు' పథకం కింద ఎంపికైన కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే పనులకు నిధులున్నా, నేటికీ సౌకర్యాలు కల్పించడం లేదు. మండల వ్యాప్తంగా 58 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 46 ప్రాథమిక, ఏడో ప్రాథమికోన్నత, నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేటు పాఠశాలలకు దీటు గా తీర్చిదిద్దుతామని చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంలో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. 'నాడు - నేడు' మొదటి విడతలో ఏడు పాఠశాలలు, రెండో విడతలో 21 పాఠశాలలకు నిధులు మంజూరు చేశారు. ఎస్ఎంసీ తీర్మానంతోనే పనులు ప్రారంభించారు. ఇందులో పూర్తి శిథిలావస్థకు చేరుకున్న మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) భవనాన్ని తొల గించారు. ఆ స్థలంలోనే నూతన భవనం నిర్మాణం చేపట్టకుండా, ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని ఆలస్యం చేశారు. ఈ పాఠశాలను యేడాదికి పైగా ఓ అద్దె భవనంలో కొనసాగించారు. ప్రభుత్వం నుంచి అద్దెలు రాకపోవడంతో, ఉపాధ్యాయులే చెల్లించాల్సి వచ్చింది. అయితే ఎస్ఎంసీ తీర్మానం మేరకు తొలగించిన భవనం స్థానంలోనే కొత్త నిర్మాణం ప్రారంభించినా పూర్తి కాలేదు. ప్రస్తుతం పాఠశాలలోని గ్రంథాలయ భవనంలోనే నేటికీ పాఠశాల కొనసాగుతోంది. నూతన భవన నిర్మాణం మొండిగోడలకే పరిమితమైంది. పనుల కోసం కొనుగోలు చేసిన కంకర, కడ్డీలు ఆరుబయటే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికీ ఆ పాఠశాలకు సంబంధించి రూ.6.02లక్షల నిధులు ఉన్నాయి. అలాగే ధని యాన్‌చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 13 లక్షలు, నల్లచెరువు మండలంలోని కుమ్మరవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల వంటగదికి మంజూరైన రూ. 5 లక్షలు, సానేవారిపల్లిలో ప్రహరీకి రూ. 2లక్షలు, ఓరు వాయి ప్రాథమిక పాఠశాల గేటుకు రూ.1.5లక్షల నిధులు అలానే ఉన్నాయి. నిధులున్నా, ప్రభుత్వ ఆదేశాలు రాకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. అసంపూర్తిగా మరుగుదొడ్లు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంట గదులు నిర్మాణంలో ఉండడంతో ఆరుబయటే వంట చేస్తున్నారు. ఈ నిధులను మండలంలో నూతనంగా చేపట్టనున్న మోడల్ స్కూల్ నిర్మాణానికి వెచ్చించ నున్నట్లు తెలుస్తోంది.

ప్రహరీకి నోచుకోని పాఠశాల

నంబులపూలకుంట మండలంలోని ధనియాన్‌చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన ప్రహరీ నిర్మాణం పునాదులకే పరిమితం కావడంతో పాఠశాల ఆవరణంలో మూగజీవాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. అలాగే రాత్రిళ్లు మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారుతోంది. పాఠశాలలో అదనపు గదులు, మూత్రశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగడానికి నీరు లేకపోవడంతో ఉపాధ్యాయులే క్యాన్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ పాఠశాలలో బెంచీలు కూడా లేవు. ప్రహరీ నిర్మించకపోవడంతో ఆ స్థలం కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు అంటున్నారు. పాఠశాలలో కడ్డీలు, ఇసుక, కంకర అలాగే ఉన్నాయి. సోమరాజుకుంట, ఎన్పీకుంట కేజీబీవీలో సిమెంటు గట్టకట్టుకుని పోయింది. కొనుగోలు చేసిన సామాగ్రిని భద్రపరుచుకోవడానికి ప్రధానోపాధ్యాయులు నానా తంటాలు పడుతున్నారు. సామగ్రిని కొందరు ఎత్తుకెళ్లిపోతున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్లు పూర్తి చేయండి



విద్యార్థులు మలమూత్రాలకు ఆరుబయటకు వెళ్లకుండా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లును పూర్తి చేయాల్సిన అవసరముంది. పాత మరుగుదొడ్లు స్థానంలో నూతనంగా నిర్మించేవి అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పాఠశాలలో బెంచీలు లేకపోవడంతో పిల్లలు కిందే కూర్చుంటున్నారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన సామగ్రి చోరీకాకుండా, పనులను త్వరగా చేపట్టాలి.

-మహమ్మద్‌రఫీ, ధనియాన్‌చెరువు

గ్రంథాలయంలో పాఠశాల కొనసాగిస్తున్నాం



పాఠశాలలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు 25మంది విద్యార్థులున్నారు. పాఠశాల గ్రంథాలయం గదిలోనే విద్యాబోధన కొనసాగిస్తున్నాం. ఇద్దరు ఉపాధ్యాయులం ఉన్నాం. ఒకే గదిలో అంతమందికి బోధన చేయడం కష్టంగా ఉంది. ఈ పాఠశాలకు మంజూరైన రూ.6.20 లక్షల నిధులున్నాయి. గతంలో కొనుగోలు చేసిన సామగ్రిని భద్రపరిచాం.

- రామమోహన్, హెచ్ఎం, ఎన్పీకుంట పాఠశాల

నిధులు ఖర్చుచేయకూడదని ప్రభుత్వ ఆదేశం

'నాడు- నేడు' కింద పాఠశాలలకు విడుదల చేసిన నిధులను ఖర్చు చేయకూడదని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నాయి. ఆ మేరకు ఎక్కడా నిధులు ఖర్చు చేయడం లేదు.

-గోపాల్‌నాయక్, ఎంఈఓ, ఎన్పీకుంట

సర్వేకు సహకరించండి : తహసీల్దార్

నంబులపూలకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమోటోగా కులధ్రువీకరణపై సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, వృత్తి తదితర వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థ వంతంగా అమలు చేసేందుకు సెప్టెంబరు 15 వరకు ఈ సర్వే కొనసాగిస్తామన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఇరువైపులా చెట్ల తొలగింపు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మండ్లిపల్లి వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. మలుపుతో పాటు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడమే కారణమంటూ పలువురు ఆరోపణలు చేశారు. స్పందించిన జాతీయ రహదారుల అధికారులు మంగళవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను ఎక్స్‌వేటర్‌తో తొలగించే కార్యక్రమం చేపట్టారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా సహకరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు, బాలసముద్రం ఎంపీటీసీ అమర్‌కార్తికేయ, గ్రామస్థులు, పోలీసులు పాల్గొన్నారు.

చీడపీడలపై అవగాహన

అమడగూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో రైతులు సాగుచేసే పంటలకు సోకే చీడపీడలపై డీఆర్‌సీ ఏడీ చైతన్య, వెంకటరమణాచారి సూచనలు, సలహాలు ఇచ్చారు. 'పొలం పొలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహమ్మదాబాద్ గ్రామ సచివాల యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. వేరుశనగ, మొక్కజొన్న, టమోట పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఈఓ రమేష్‌నాయక్, రైతులు నాగేంద్రరెడ్డి, అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం టీడీపీ కార్యకర్తలు, నాయకులపై ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మంగళవారం ఎమ్మెల్యే క్యాంప కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్లతో ఎమ్మెల్యే మాజీమంత్రితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇన్ని మంచిపనులు చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గుర్తుంచుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. స్థానిక సంస్థల గెలుపై లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ కన్వీనర్లు రామాంజినేయులు, విజయ్‌కుమార్, జయచంద్ర, మైలేశంకర్, ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్షాకాలంలో వీలైనంత ఎక్కువగా హంద్రీనీవా కాలువ్లజలాలతో నింపేవిధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు, సాగునీటి సంఘ అధ్యక్షులకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచించారు. బాబా జయంతి ఉత్సవాల సందర్భంగా చేపడుతున్న చిత్రావతీ సుందరీకరణ పనులు వేగవంతంచేయాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- గ్రామ సచివాలయ ఉద్యోగులకు డీడీఓ సూచన

తాడిమర్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సచివాల య ఉద్యోగులు నిత్యం ప్ర జలకు అందుబాటులో ఉం డి ప్రభుత్వం నుంచి వస్తు న్న సంక్షేమఫలాలు, పథ కాలు వారికి అందేలా చూ డాలని డీడీఓ జనార్దన్ రావు సూచించారు. ఆయన మంగళవారం తాడిమర్రి, కునుకుంట్ల సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లోని రికార్డులను తనిఖీ చేయడంతో పాటు సర్వే తీరు గురించి ఆరాతీశారు. కునుకుంట్లలో జరుగుతున్న స్వమిత్వ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ రంగారావు, డిప్యూటీ ఎంపీడీఓ విజయశేఖర్‌నాయుడు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని కార్యదర్శుల వినతి

కదిరి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తమకు పనిభారం తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం డీఎల్‌డీఓ వెంకటరత్నంకు వినతిపత్రం అందించారు. వారు మంగళవారం డీఎల్‌డీఓను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వ సెలవుదినాల్లోనూ వివిధ సర్వేల పేరుతో పంచా యతీ కార్యదర్శుల ద్వారా పనులు చేయిస్తుండడంతో మానసికంగా తీవ్ర వత్తిడికి లోనవుతున్నట్లు తెలిపారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ఫలితాల ఆధారంగా కార్యదర్శుల పనితీరును నిర్ధారించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు విడుదల చేయాలని కోరారు.

భూ సమస్యలపై ఆర్డీఓ విచారణ

నల్లమాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.బండవాండ్లపల్లికి చెందిన సానే చెన్నారెడ్డి, లక్ష్మిరెడ్డి, గంగిరెడ్డి వారి వారసులు వారి భూములను 50యేళ్ల క్రితం పలువురు రైతులకు విక్రయించారు. ఈ భూములు బండవాండ్లపల్లి, కొండ్రావారిపల్లి, బానంవారిపల్లి, అరవవాండ్లపల్లితండా, పేమనకుంటపల్లితండా గ్రామాలకు చెందిన రైతులు కొనుగోలు చేశారు. అయితే ఎన్. బండవాండ్లపల్లి గ్రామానికి చెందిన సానే రవీంద్రారెడ్డి ఈభూముల్లో తమకు కూడా హక్కు ఉందని కోర్టును ఆశ్రయించారు. దీనిపై పలువురు రైతులు ఢిల్లీలోని ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ మంగళవారం పేమనకుంటపల్లి తండాకు వచ్చి కొనుగోలు చేసిన రైతుల రికార్డులను, సాగుచేసిన పంటలను పరిశీలించారు.

క్రీడాకారులకు సహకారం అందిస్తా

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



విద్యార్థులను అభినందిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చాటే విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఒంగోలులో ఈనెల 17న జరిగిన 43వ యానివర్సిరీ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో ప్రతిభచాటిన ధర్మవరం విద్యార్థులను ఆయన మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అభినందించారు. ధర్మవరానికి చెందిన మల్టిస్టార్ బుడోఖాన్ విద్యార్థులు కటాస్, కుమితే విభాగాల్లో పాళ్యం మహీధర్, కుమితే విభాగంలో జింకా యోగేష్‌కుమార్ బంగారు, కాంస్య పతకాలు సాధించారు. వారికి టీడీపీ నాయకులు సంధారాఘవ, జింకా పురుషోత్తం, కొత్తపేట ఆది, షేట్ చంద్ర, పాలెం ప్రసాద్ నుంచి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

● ధర్మవరం: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణం, రూరల్, ముదిగుబ్బ మండలాలకు చెందిన పలువురికి సీఎంఆర్ ఎఫ్ కింద సాయం అందినట్టు ఆయన తెలిపారు. మొత్తం 12 మందికి రూ.10.36 లక్షలు విలువైన చెక్కులను ఆయన మంగళవారం పట్టణంలోని ఎర్రగుంటలో ఉన్న టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

బీజేపీలోకి పలువురి చేరిక



బీజేపీలో చేరిన వారితో హరీష్ బాబు

ధర్మవరం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డు గాంధీనగర్‌కు చెందిన కృష్ణమూర్తి, వైసీపీ నాయకులు జానకి, కంబగిరి అనచరులు మంగళవారం వైసీపీని వీడి బీజేపీలోకి చేరారు. వారికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. బీజేపీ నాయకులు అంబటి సతీష్, సాకే ఓబిలేసు, గొట్లూరు చంద్ర, పోతుకుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రబాబునగర్ ప్రాంతంలో వర్షం కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయని స్థానికులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మంగళవారం చంద్రబాబునగర్‌లో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా 35వ వార్డులో బండగుంతకు ఫెన్సింగ్ వేసిఏన శాశ్వత పరిష్కారం చూపుతామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వీరేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శామ్సన్, టీడీపీ నాయకులు తోట నారాయణస్వామి, రాయపాటి శివ, చింతా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పట్టుతో రైతు ఆదాయం పెంచుదాం

- పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య



'నా పట్టు-నా అభిమానం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టు ఉత్పత్తిని పెంచి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేద్దామని అనంతపురం ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య తెలిపారు. మండలంలోని రేగాటిపల్లిలో మంగళవారం 'నా పట్టు-నా అభిమానం' అనే ప్ర చార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లా జా యింట్ డైరెక్టర్ శోభారాణి, ఏడీ అప్పలనాయుడు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి, రైతులకు పట్టు ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ఆకుల నాణ్యత, దిగుబడిని పెంచడానికి పోషణ మల్టీ న్యూ ట్రియంట్ పిచికారీ, తెగుళ్ల నియంత్రణకు పురుగుమందులకు బదులుగా వేపనూనె వాడకంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రమ్య మాట్లాడుతూ.. మల్బరీ పంటను కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక పట్టుపరిశ్రమశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫ్లోర్‌బాల్ పోటీల్లో బుక్కపట్నం విద్యార్థుల సత్తా



సత్తా చాటిన విద్యార్థులతో అధ్యాపకులు

బుక్కపట్నం, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 3న నరసారావుపేటలో జరిగిన అండర్ 14, 19 పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో పాల్గొన్న మండల క్రీడాకారులు తమ సత్తా చాటి మెడల్స్ ప్రసంశా పత్రాలు అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనదరచిన అండర్ 14 విద్యార్థులు ఆయాన్‌సాయి, సందీప్, సమీర్, వెంకటసాయి, అండర్ 19లోని నరేంద్ర, విష్ణు, విఘ్నేష్‌ను పాఠశాల హెచ్ఎం జగదీష్, పీడీ రామక్రిష్ణ, ఫ్లోర్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూల ప్రసాద్ ఉపాధ్యాయులు పాఠశాలలో మంగళవారం అభినందిచారు.

రాష్ట్రస్థాయి యోగా టోర్నీకి కదిరి విద్యార్థులు



ఎంపికైన హరీష్ పాఠశాల విద్యార్థులు


కదిరి అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా టోర్నమెంటుకు కదిరిలోని హరీష్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. గుంతకల్లులో సోమవారం జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా యోగా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారన్నారు. ఎంపికైన అస్రితా, రేవంత్, భానుప్రసాద్‌నాయుడు, గోవర్ధన్‌ను మంగళవారం పాఠశాలలో వారికి మెమెంటోలు అందించి అభినందించారు.

అప్పు చెల్లించమంటే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు

ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరిస్తున్నాడని ఓ వ్యక్తిపై ఆలకుంట సంతోష్, నారాయణ ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సిమెంట్ వ్యాపారం చేద్దామని పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ తారక రామాపురానికి చెందిన ఆ లకుంట సంతోష్ నుంచి రూ.5.30లక్షలు, నారాయణ నుంచి రూ. 2.20లక్షలు తీసుకున్నాడు. అగ్రి మెంట్ రాసుకున్నారు. ఆర్నెల్లు గడిచినా అనిల్‌కుమార్ పట్టించుకోక పోవడంతో వారు మంగళవారం అతడి ఇంటికి వెళ్లారు. డబ్బు అయినా ఇవ్వమని అడిగి తే మీ అంతు చూస్తా నంటూ బెదిరించాడని సంతోష్, నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు అనిల్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

అర్హత ఉన్నా పింఛన్లు తొలగించారు

- దివ్యాంగుల నిరసన



ధర్మవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద దివ్యాంగుల నిరసన

ధర్మవరం రూరల్, ఆగస్టు19 (ఆంధ్ర జ్యోతి): ఏళ్లుగా పింఛన్లు పొందుతున్నామని, అన్ని అర్హతలు ఉన్న తమకు ప్రస్తుత వెరిఫికేషన్‌లో నిలిపి వేశారని పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు పింఛ న్లు పునరుద్ధరించాలని కోరారు. ఈ మేర కు వారు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పింఛన్లు రాకుంటే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. అనంతరం ఎంపీడీఓ సాయి మనోహర్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ఎవరి పింఛన్లు నిలిచిపోవవని, రీవెరిఫి కేషన్‌కు స్థానిక సచివాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్డీఓకు వినతి

● ధర్మవరం: వెరిఫికేషన్ పేరుతో తొలగించిన అర్హులైన దివ్యాంగులకు పింఛన్ కొనసాగించాలని సీఐటీయూ నాయకులు మంగళవారం ఆర్డీఓ మహేశ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ... వెంటనే అర్హులైన వారి పింఛన్లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్డీఓను కలిసిన వారి లో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్‌బాషా, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తల కదిరప్ప, సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ, చేనేత నాయకు లు వెంకటస్వామి ఉన్నారు.

రాస్తారోకో

● బత్తలపల్లి : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో అర్హులైన పలువురు దివ్యాంగుల పింఛన్లు తొలగించారని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం దివ్యాంగులతో కలసి సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వ హించారు. వెరిఫికేషన్ చేసిన వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మండలవ్యాప్తంగా 512 మంది అర్హులైన దివ్యాంగులు పింఛన్లు కోల్పోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు వారితో మాట్లాడి అక్కడి నుంచి పంపివేశారు. సీపీఐ నాయకులు కాటమయ్య, వెంకటేశ్, రామకృష్ణ, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

వడిసలమ్మకు విశేష పూజలు



మడకశిర టౌన్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణలో వెలసిన వడిసలమ్మ దేవాలయంలో అమ్మవారు మంగళవారం ప్రత్యేకంగా రంగు రంగు పూల అలంకరణలో కొలువు దీరారు. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరణ చేసి పూజలు చేశారు. కొల్హాపురమ్మ, గంగాభవాని, పూజమ్మ, మూలకంఠేశ్వరి తదితర అమ్మవార్లకు దీపారాధన విశేష పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



తుమ్మల మారెమ్మకు..

గుడిబండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యలు తెలపండి

ఎమ్మెల్యే పీఏ వీరయ్య



సమస్యలు తెలుసుకుంటున్న వీరయ్య

చిలమత్తూరు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్తశుద్ధితో ఉన్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ సమస్యలను తెలపాలని ఎమ్మెల్యే పీఏ వీరయ్య సూచించారు. మండలంలోని చాగలేరు పంచాయతీలోని గ్రామాల్లో ఆయన మండల కన్వీనర్ శ్రీనివాసులుతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలతోపాటు ప్రజల వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైస్ఎంపీపీ బయప్ప, నాగరాజు, సత్యనారాయణ, వెంకటశివప్ప, ఆనంద్, అంజి, మంజు ఉన్నారు.

లేపాక్షి, (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ వెంకటాపురం అబి అన్నారు. మంగళవారం షైదుగోళం గ్రామంలో ప్రజావేదిక నిర్వహించారు. గ్రామసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయ కర్త జయప్ప, తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజునాయక్, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

డీజే నిషేధం

పావగడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గణేష్ చతుర్థి, మిలాద్ఉన్నబి పండుగలకు డీజేను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధించినట్లు పావగడ సీఐ సురేష్ తెలిపారు. ఎస్ఎస్కె సముదాయ భవనంలో నిర్వహించిన హిందూముస్లింల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డీజే నిషేధమని, నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు పండుగలను సోదరభావంతో జరుపుకోవాలని ఎస్ఐ విజయ్కుమార్ సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్, పోలీస్స్టేషన్ల నుంచి అనుమతి తీసుకుని గణేష్ విగ్రహాన్ని ఉంచాలన్నారు.

రెండురోజులపాటు విద్యుత్ అంతరాయం

మడకశిర టౌన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాలలోని బుధ, గురువారాలు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ రఘు తెలిపారు. రొళ్ల మండలంలోని బి.జీ.హళ్లి సబ్స్టేషన్లో మరమ్మతు కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఆర్థికసాయం అందజేత

మడకశిర రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఏడుగురికి రూ. 58 వేలు ఆర్థికసాయం అందజేసినట్లు హెచ్ఎంలు విశ్వనాథ్, చంద్రమోహన్ తెలిపారు. బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు రూ. 58 వేలను ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న విద్యార్థుల కోసం ఇవ్వడం జరిగిందని, ఈ మొత్తాన్ని అందజేయడం జరిగిందని హెచ్ఎంలు తెలిపారు.

'యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి'

చిలమత్తూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణయాదవ్ సూచించారు. వడ్డిచెన్నంపల్లి గ్రామంలోని యువకులకు ఆయన క్రికెట్ కిట్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు పెడతోవపడుతున్నారన్నారు. వారు మంచి మార్గంలో పయనించాలంటే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను పల్లకిలో ఊరేగించారు. ముద్దిరెడ్డిపల్లిలోని భాగ్యనగర్ వాటర్ ట్యాంక్ వద్ద కృష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ ప్రతిమకు నాలుగు రోజులపాటు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి నాయకులు పామిశెట్టి ఆదినారాయణ, శేఖర్, కిష్టప్ప, మునీంద్ర, గణేష్, సుభద్ర, జ్యోతి, పార్వతమ్మ, జయమంగళ గౌరి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

హిందూపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభకు సంబంధించి ఆ పార్టీ నాయకులు మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద రాష్ట్ర మహాసభలకు సంబంధించి పోస్టర్లను హిందూపురం కార్యదర్శి వినోద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఈనెల 23న రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనున్నాయని, హిందూపురం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ చలో బెంగళూరు

పావగడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏబీసీడీ వర్గీకరణ కోరుతూ బెంగళూరు ఫ్రీడం పార్కులో జరుగుతున్న కార్యక్రమానికి మద్దతుగా పావగడ నుంచి జీవిత విముక్తి కర్ణాటక, జీవిక సంఘం నాయకులు మంగళవారం రెండు బస్సుల్లో తరలివెళ్లారు. వర్గీకరణపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటున్న సందర్భంగా మద్దతు తెలపడానికి తుమకూరు జిల్లా నుంచి దళిత నాయకులు తరలివెళ్లారు.

ఆగిన స్థిరాస్తి వ్యాపారం

జిల్లాల పునర్విభజన చర్చ ఎఫెక్ట్

కొనేవారుఉన్నా.. అమ్మేవారు లేరు



హిందూపురం సమీపంలో వెలసిన లేఅవుట్

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడ్డాక స్థిరాస్తి వ్యాపారం కొంత ముందుకు కదిలింది. ముఖ్యంగా హిందూపురం పట్టణంలో ఉద్యోగులు, వ్యాపారులు ఇళ్ల నిర్మించుకోవడానికి ముందుకొచ్చారు. దీంతో గత వైసీపీ కాలంతో పోలిస్తే యేడాది కాలంగా ప్రతి వీధిలో ఏదో ఓ ప్రాంతంలో కొత్తిల్లు నిర్మాణం జరుగుతోంది. అయితే కొద్ది రోజులుగా హిందూపురంలో స్థిరాస్తి వ్యాపారం మందగించింది. ఇందుకు ప్రధాన కారణం జిల్లాల పునర్విభజన జరుగుతాయని, జిల్లాకేంద్రాలుగా మారవచ్చని చర్చ జనంలోకి రావడంతో కొనేవారున్నా అమ్మేవారు వెనుకడుగు వేస్తున్నారు. దీనివల్ల హిందూపురంలో ప్లాట్ల క్రయవిక్రయాలు చాలావరకు తగ్గినట్లు రిజిస్ట్రేషన్శాఖ లెక్కలుచెబుతున్నాయి.

జిల్లాల పునర్విభజన చర్చే కారణమా?

నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయిజిల్లాలో అతిపెద్దపట్టణం హిందూపురమేనని చెప్పవచ్చు. హిందూపురం పట్టణం విస్తరిస్తూనే ఉంది. హిందూపురం పరిధిలో పారిశ్రామికవాడలు, విద్యాసంస్థలున్నాయి. బ్యాంకులు 25కుపైగా ఉన్నాయి. దీనివల్ల పల్లెల నుంచి కూడా చాలామంది చదువులు, ఉద్యోగాల కోసం హిందూపురానికి వచ్చి అద్దె ఇళ్లలో ఉంటున్నారు. దీనివల్ల ఇక్కడ ఇంటి స్థలాల ధరలు మామూలుగానే పెరిగాయి. అయితే జిల్లాలో పునర్విభజన జరగవచ్చని జిల్లా కేంద్రాలు కూడా మారవచ్చని జనంలో చర్చ మొదలవడంతో హిందూపురంలో ఇంటి స్థలాలు కొనేవారున్నా అమ్మేవారు కనిపించడంలేదు. యేడాది క్రితం వరకు కొన్నిచోట్ల ఇంటి స్థలాలపై ఉన్నదానికంటే తక్కువకు విక్రయించారు. ఉదాహరణకు గత వైసీపీ హయాంలో రూ.20లక్షలు పెట్టి కొనుగోలు చేసిన స్థలం రూ.17, రూ.18లక్షలకే విక్రయించారు. కానీ నేడు అదే స్థలం రూ.25లక్షలు దాటింది. అయినా అమ్మేవారు లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయేతప్ప ఎక్కడా కొన్నట్లు కనిపించలేదు. ముఖ్యంగా ఇటీవల జిల్లాల పునర్విభజన తెరపైకి రావడంతో హిందూపురానికి మంచి భవిష్యత్తు రావచ్చనే అంచనాతో భూములు, ఇంటి స్థలాలున్నవారు విక్రయించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎందుకంటే భవిష్యత్తులో హిందూపురం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తాయనే నమ్మకంతోపాటు జిల్లాకేంద్రం అయితే భవిష్యత్తులో స్థలాలు దొరికే అవకాశం ఉండదని కొంతమంది కొనడానికి సిద్ధంగా ఉన్నారు. అయినా అమ్మేవారు మాత్రం ముందుకు రావడంలేదు.

తగ్గిన క్రయవిక్రయాలు

గతనాలుగు నెలలుగా హిందూపురం పట్టణంతోపాటు చుట్టూ ప్రాంతంలో క్రయ విక్రయాలు బాగా తగ్గాయని రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా తెలుస్తుంది. గతంలో హిందూపురం సబ్రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ పట్టణానికి సంబంధించి 10నుంచి 15ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగేవి. నేడు 5లోపే జరుగుతున్నాయి. అదికూడా గతంలో అగ్రిమెంట్ చేసుకున్నవి లేదా తగాదాలున్నవే జరుగుతున్నట్లు తెలిసింది. దీంతో కొంతమంది కొనడానికి ఉత్సాహం చూపుతున్నారు. అయినా అమ్మేవారు మాత్రం ఇష్టంలేక ధరలు ఎక్కువగా చెబుతున్నారు. దీనిని బట్టి స్థిరాస్తి వ్యాపారం స్తబ్ధతగా ఉన్నట్లు తెలుస్తుంది.

ఐదేళ్ల జగన్ పాలన.. నరకం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలు నరకం అనుభవించారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 31 మందికి రూ. 12 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ అనేది జగన్ పాలనలో పేదలకు అందని ద్రాక్షలా మారిందని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో నరకం అనుభవించిన ప్రజలు కేవలం 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. చివరకు తాడేపల్లి ప్యాలెస్లో కూర్చోబెట్టారన్నారు. అయినా జగన్కు బుద్ధి రాలేదని విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, రూరల్ అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలి

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి అందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి నియోజకవర్గంలోని హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంరక్షణ విషయంలో హాస్టల్ వార్డన్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

రోగులకు మెరుగైన చికిత్స అందించాలి

రొళ్ల(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించి చికిత్స చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో వైద్యులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలప్రణీత్రెడ్డి, సృజన, కులదీప్, కన్వీనర్ పాండురంగప్ప, సింగిల్విండో అధ్యక్షులు దాసిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఈరన్న, కార్యదర్శి ఉగ్రేగౌడ్, కోఆర్డినేటర్ రామక్రిష్ణ, ఎస్సీసెల్ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీకి సన్మానం

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): ఒక్కలిగ సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని మంగళవారం సన్మానించారు. నూతన కార్పొరేషన్ చైర్మన్గా లక్ష్మీనారాయణ ఎంపికైన సందర్భంగా వారు సత్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్విండో అధ్యక్షులు గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మారుతిప్రసాద్, జడ్పీటీసీ స్వారక్క, నరసింహమూర్తి, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మడకశిర రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీ పల్లి గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మంగళవారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండమల తిప్పేస్వామి.. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఒక్కలిగా కార్పొరేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, కౌన్సిలర్ నాగేంద్ర పాల్గొన్నారు.

కల్లూరులో కార్డెన్ సెర్చ్

లేపాక్షి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు మంగళవారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో రౌడీషీటర్ల ఇళ్లను సోదాలు చేశారు. గతంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న వ్యక్తుల ఇళ్లను, పరిసరాల్లో సోదాలు నిర్వహించారు. వాహనాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ ఎటువంటి గొడవలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముందుస్తు సమాచారం ఇవ్వాలి: ఎస్ఐ

పరిగి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారన్న ముందస్తు సమాచారం సచివాలయ మహిళా పోలీసులు ఇవ్వాలని ఎస్ఐ రంగడు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎన్ని వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు..? పరిసర ప్రాంతాల్లో రౌడీషీటర్లు, పోక్సో కేసు నిందితులు ఉన్నారా..? తదితర సమాచారాన్ని తమకు అందించాలన్నారు. ఆ సమాచారం మేరకు నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

దుకాణంలో చోరీ

పెనుకొండ రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ దుకాణంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామీన బ్యాంకు ఎదురుగా ఓ దుకాణం ఏర్పాటుచేసుకుని రవికుమార్ జీవినం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి దుండగులు షాపు తాళాలు పగలకొట్టి అందులో ఉన్న రూ.20వేలు నగదు, రూ.30వేలు విలువచేసే సరుకును ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఊడిన ఆర్టీసీ బస్సు చక్రాలు

గుడిబండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసీగిరి, భైరేపల్లి గ్రామాల మధ్యలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. లింగదహళ్లి వయా వస్కుర వెళ్లే బస్సు మధ్యాహ్నం భైరేపల్లి, పీసీ గిరి గ్రామాల మధ్యలో వెళుతుండగా వెనుక చక్రాలు ఊడిపోయాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సు ఆపివేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.



చక్రాలు ఊడిపోయిన బస్సు

అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమలశాఖ డిప్యూటీ డైరెక్టర్

హిందూపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లాపరిశ్రమల డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ షఫీ మాట్లాడుతూ.. ర్యాంప్ప్రోగ్రాంలో భాగంగా కొత్తగా పారిశ్రామికవేత్తలు రావాలని చూస్తున్నవారికి ప్రభుత్వం కూడా పలు సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఎన్నడూలేని విధంగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం మంచి అవకాశం ఇస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రామాంజినేయులు, పరిశ్రమల విస్తరణ అధికారులు, దుర్గేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల ర్యాలీ



తెలుగుతల్లి విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్లు

హిందూపురం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫోటోగ్రాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోటో గ్రాఫర్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పెనుకొండ రోడ్డులో ర్యాలీగా వెళ్లి తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలువేశారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ... వెయ్యి పదాలకన్నా ఫొటో మిన్న అన్నారు. ఏళ్లు గడిచినా దశాబ్దాలు గడిచినా ఫోటో అనేది మనకు తీపిగుర్తుగా నిలిచిపోతుందన్నారు.

ఫుట్బాల్ చాంపియన్.. జిల్లా జట్టు

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్బాల్ పోటీలలో జిల్లా జట్టు చాంపియన్గా నిలిచిందని కోచ్ మహ్మద్ సలీం, మేనేజర్ ఇర్షాద్ అలీ తెలిపారు. టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్లలో జిల్లా జట్టు విజయం సాధించిందని వారు తెలిపారు. గత ఏడాది కూడా జిల్లా జట్టు రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. విజయం సాధించిన జట్టును ఫుట్బాల్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు అనిల్ కుమార్ అభినందించారు.



రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన జిల్లా జట్టు

అర్హులకు న్యాయం చేయాలి

టీడీపీ కన్వీనర్ శ్రీరాములు



దివ్యాంగులతో టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించారనీ, వారికి న్యాయం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పింఛన్ కోల్పోయిన తొమ్మిది మంది దివ్యాంగులతో కలిసి సూపరింటెండెంట్ మోహన్నాయక్ను ఆయన కలిశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్లో అనర్హులుగా గుర్తించారనీ, వీరంతా దివ్యాంగులనీ, న్యాయం చేయాలని కోరారు. తాము ఏమీ చేయలేమని సదరంలో తిరిగి నమోదు చేసుకుంటే రీ వెరిఫికేషన్లో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. సూపరింటెండెంట్ను కలిసిన వారిలో కౌన్సిలర్ గిరి, మహిళా కన్వీనర్ రమణమ్మ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత

పెనుకొండ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు జఫ్రుల్లాఖాన్ (70) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా కొనసాగారని, మైనార్టీ సెల్ కార్యవర్గ సభ్యుడిగా, పెనుకొండ మండలం ఇస్లాపురం సింగిల్విండో అధ్యక్షుడిగా రెండుసార్లు, ఉమ్మడి జిల్లా జడ్పీ కోఆప్షన్మెంబర్గా సేవలందించారన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాధవనాయుడు, నారాయణస్వామి, కన్వీనర్ శ్రీరాములు, మీసేవ షమి, షౌకత్, బాబుల్రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న వీరయ్య

సోమందేపల్లి/చిలమత్తూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్ తల్లి నరసమ్మ మంగళవారం మృతిచెందారు. దండోర నాయకులు కిష్టప్ప, సూర్యనారాయణ తదితరులు నివాళులు అర్పించారు. ఆమె ఆత్మశాంతికోసం ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. దండోర నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య, మండల కన్వీనర్ శ్రీనివాసులు నివాళులు అర్పించారు. వారి వెంట నాయకులు సోమశేఖర్, విశ్వనాథరెడ్డి, మంజునాథ్, సురేంద్ర, కృష్ణమూర్తి ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి: ఏఓ



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సోమందేపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్లో సాగుచేసిన పంటలకు రైతులు సస్యరక్షణ పాటించడంవల్ల అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ విజయభారతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఈదులబళాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఇమామిత్రిన్, బెంజోవెట్ పిచికారీ చేయాలన్నారు. పత్తి రైతులు టైప్-1 షెడ్లను రాయితీతో నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అలైఖ్య, సిరికల్చర్ టీఓ సుబ్రహ్మణ్యం, డీఏఏ నరసింహమూర్తి, అంజినప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేశారు. ప్రతినెలా మూడో మంగళవారం ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం గర్భిణులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో దాదాపు వంద మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కిష్టప్ప, మార్కెట్యార్డ్ డైరెక్టర్ తిరుపాల్నాయుడు, సిద్ధన్న, లింగన్న, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యుడి కుల్లాయప్ప, అక్రంబాష, ఈద్గా కమిటీ అధ్యక్షుడు అన్సార్బాష, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఓటు చోరీపై కొవ్వొత్తులతో నిరసన

హిందూపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఓటుచోరీపై కొవ్వొత్తులతో ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఓటు చోరీ చేయడంతోనే రెండుసార్లు అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్నికల సంఘం తో కుమ్మక్కై ఎన్నికల్లో మోసానికి పాల్పడ్డారన్నారు. దేశ వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో ఇలాగే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిఫాయతుల్లా, ప్రభాకర్, నిస్సార్, అనీల్, కలీం తదితరులు పాల్గొన్నారు.

'బలవంతపు భూసేకరణ ఆపాలి'

పెనుకొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కారేడులో అక్రమ అరెస్టులను ఖండిస్తూ బలవంతపు భూసేకరణ ఆపాలంటూ రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సివిల్సప్లై హమాలీ యూనియన్ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు మాట్లాడుతూ చలో కారేడు కార్యక్రమంపై ప్రభుత్వం దుర్మార్గంగా అక్రమఅరెస్టులుచేసి శాంతియుతంగా సభ జరగకుండా ఉక్కుపాదం మోపిందన్నారు. వెంటనే బలవంతపు భూసేకరణ నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేశ్, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓబులు